


'సోమశిల'లో 62.650 టీఎంసీల నీరు

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం 20,300 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగింది. డ్యాంలో 62.650 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 50, కండలేరుకు 10 వేలు, ఉత్తర కాలువ 350 క్యూసెక్కుల చొప్పున నీరు సరఫరా చేస్తున్నారు.



సబ్సిడీ శనగ విత్తనాల పేరుతో ఏపీ సీడ్స్ అధికారులు చేతివాటం చూపించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రబీ సీజన్‌లో వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీతో రైతులకు శనగ విత్తనాలు పంపిణీకి ఏపీ సీడ్స్ సర్వం సిద్ధం చేసింది. 25 శాతం సబ్సిడీ ఇచ్చాక కూడా వారు నిర్ణయించిన ధర బహిరంగ మార్కెట్ ధరకన్నా ఎక్కువే ఉందంటూ రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏపీ సీడ్స్ సంస్థ నిర్ణయించిన శనగల ధర గత పదినెలల కాలంలో ఎన్నడూ లేదని, కనీసం ఆ దరిదాపులకు కూడా శనగల ధర చేరలేదని వాపోతున్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



ఏపీ సీడ్స్ సబ్సిడీ ధరకు పంపిణీ చేసే శనగ విత్తన బస్తాలు (ఫైల్)

ఇదేం ధర!

- సబ్సిడీ శనగ విత్తనాలపై రైతుల పెదవి విరుపు
- మార్కెట్ ధరతో పోల్చితే చాలా వ్యత్యాసం
- ఏపీ సీడ్స్ నిర్వాకంపై విమర్శల వెల్లువ
- వ్యవసాయ శాఖ అధికారులూ అసహనం

కందుకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లాతోపాటు పొరుగునే ఉన్న ప్రకాశం జిల్లాలోనూ లక్షల ఎకరాలలో పప్పుశనగ సాగవుతుంది. రైతులకు సబ్సిడీపై శనగ విత్తనం పంపిణీ దశాబ్దాలుగా జరుగుతోంది. అయితే, కొన్నేళ్లుగా విత్తన కొనుగోలులో అధికారుల చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయ శాఖ ద్వారా 25 శాతం సబ్సిడీపై సరఫరా చేసేందుకు సిద్ధం చేసిన కాగ్ 2 రకం శనగ విత్తనం బహిరంగ మార్కెట్లో 9వేల రూపాయలు పలుకుతోంది. అయితే ఈ రకం అసలు ధర రూ.12,100గా నిర్ణయించిన ఏపీ సీడ్స్‌సంస్థ 25 శాతం సబ్సిడీ పోను రైతులు రూ.9,075 చెల్లించాలని నిర్ణయించారు. అలాగే జేజే 11 రకం అసలు ధర రూ.9400గా నిర్ణయించిన అధికారులు సబ్సిడీపోను క్వింటాల్‌కు రూ.7050 చెల్లించాలని నిర్ణయించారు. ఈ రెండురకాలు కూడా సబ్సిడీ పోను బహిరంగ మార్కెట్ ధరకన్నా ఎక్కువ ఉండటం విశేషం. ధర అధికంగా ఉన్నప్పుడు ఏపీ సీడ్స్ అధికారులు కొనుగోలు చేసి ఉంటారని అనుకున్నా గత పదినెలలుగా ఎన్నడూ శనగల ధర వారు నిర్ణయించిన ధర బహిరంగ మార్కెట్లో పలకలేదు. ఈ ఏడాది జనవరి తర్వాత గత సీజన్ పంట రైతుల చేతికి రాగా అప్పటినుంచి గిట్టుబాటు ధర రాక రైతులు పంట ఉత్పత్తులను కోల్డ్ స్టోరేజీలలో నిల్వ చేసుకుని ఉన్నారు. గత సీజన్‌లో శనగ పంట రైతు చేతికి వచ్చే సమయానికి కాగ్ 2 రకం క్వింటాల్ రూ.8వేలకు, జేజే 11 రకం క్వింటాల్ ధర రూ.6వేలకు పడిపోయింది. ఈ ఏడాది ఆగస్టు వరకు అదే ధర స్థిరంగా కొనసాగగా వినాయకచవితి పర్వదినం సమయంలో పదిరోజులపాటు శనగల ధరల్లో కదలిక వచ్చింది. అప్పట్లో కేవలం పదిహేను రోజుల పాటు కాగ్ 2 రకం ధర అత్యధికంగా రూ.10,500, జేజే 11 రకం 7వేలు ధర పలికింది. అయితే ఎప్పుడూ బహిరంగ మార్కెట్లో లేని ధరకు, కనీసం దరిదాపుల్లో లేని ధరకు కొనుగోలు చేసినట్లు ధర నిర్ణయించటం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే ధరకైతే సబ్సిడీ విత్తనాలు రైతులెవరూ తీసుకోరన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ విత్తన కొనుగోలు వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరపాలని, ఈ విత్తనం ఏ నెలలో ఎక్కడ కొనుగోలు చేశారో నిగ్గుతేల్చటం ద్వారా బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుని రైతుకు సబ్సిడీ ఫలం అందేలా ప్రభుత్వం, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అయితే, ఈ వ్యవహారంపై వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ సబ్సిడీ శనగ విత్తనాల ధర బహిరంగ మార్కెట్ ధరకన్నా అధికంగా ఉన్నందున రైతులు ముందుకు రావడం లేదని చెప్పడం గమనార్హం. ఈ కొనుగోలు వ్యవహారం ఏపీ సీడ్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిందని, ఇంత ధర పెట్టి ఎందుకు కొనుగోలు చేశారో తమకూ అర్థం కాలేదని వ్యాఖ్యానించారు.





రచ్చకెక్కిన ఎస్సీ కార్పొరేషన్

- అనర్హుల చేతికి స్వయం ఉపాధి రుణాలు
- రికవరీకి ఆదేశాలు.. విచారణ
- ఇద్దరు అధికారులు, ఉద్యోగులపై వేటు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నిధులలేమితో అల్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ రచ్చకెక్కింది. పలు పథకాల కింద లబ్ధిదారులకు రుణాలు అందచేసిన అధికారులు రుణాల వసూళ్లకు పూనుకోవటంతో వార్తల్లోకి ఎక్కింది. 2015-2019 మధ్య కాలంలో ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ, ఎన్ఎస్ఎఫ్‌డీసీ పథకాల ద్వారా ఎస్సీ నిరుద్యోగ యువత స్వయం ఉపాధి కోసం బ్యాంకులతో సంబంధం లేకుండా రూ.2,300కోట్ల రుణాలను నేరుగా అందచేసింది. ఈ రుణాలను కొందరు అనర్హులు తీసుకోగా, రుణాల ద్వారా జేసీబీ లు, ఇన్నోవా కార్లు తదితరాలను కొనుగోలు చేసినట్లు తెలిసింది. అలాంటి వారి నుంచి రికవరీ కోరుతూ ఎస్సీ కార్పొరేషన్ అధికారులు నోటీసులు జారీ చేయటంతో సమస్య మొదలైంది. నోటీసులు అందచేసిన వారిపై కొందరు తిరగబడినట్లు తెలిసింది. ఈ రుణాలకు పూచీకత్తు ఇచ్చిన సుమారు 980 మంది ఉద్యోగులు, 470 మంది లబ్ధిదారులకు ఎస్సీ కార్పొరేషన్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఎన్ఎస్ఎఫ్‌డీసీకి ప్రతినెలా లబ్ధిదారుల నుంచి సుమారు రూ.24 లక్షలు వసూలు చేయాల్సి ఉన్నా మందకొడిగా సాగుతోంది.


ఇద్దరు అధికారుల సస్పెన్షన్

ఎస్సీ కార్పొరేషన్‌లో అక్రమాలు జరిగాయంటూ ఓ న్యాయవాది లోకాయుక్తలో పిటిషన్ వేశారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని లోకాయుక్త ఎస్సీ

- మిగతా 8లో..

ప్రతిభకు 'ఆట'ంకం

- క్రీడాకారుల కోసం రూ.40 లక్షలు విడుదల
- అధికారుల మధ్య సమన్వయ లోపం
- ఉమ్మడి ఖాతాలు లేక జమకాని నిధులు



నెల్లూరు (విద్య), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ఉత్తమంగా రాణించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఎస్‌జీఎఫ్ (పాఠశాలల క్రీడా సమాఖ్య) నిధులు విడుదల చేసినా యంత్రాంగంలో సమన్వయం కొరవడింది. దీంతో ఆ నిధులు ప్రభుత్వ ఖాతాల్లోనే ఉండిపోయాయి. అధికారులు, కార్యదర్శులకు ఉమ్మడి ఖాతాలు ఉండాలన్న నిబంధనలు ఉన్నా ఇప్పటివరకు ఖాతాలు తెరవకుండానే ఎస్‌జీఎఫ్ పోటీలను నిర్వహిస్తుండటం విశేషం. కూటమి ప్రభుత్వం మాత్రం దీనిపై ప్రత్యేక దృష్టి సారించి ఖచ్చితంగా ఉమ్మడి ఖాతాలు ఉండాల్సిందేనని, ప్రతి రూపాయికి లెక్క చెప్పాల్సిందేనని స్పష్టం చేసింది. దీంతో సంబంధిత కార్యదర్శులు, అధికారులు ఇప్పటికిప్పుడు హడావుడి పడుతూ ఖాతాలు తెరిచే ప్రయత్నాలు ప్రారంభించారు.

2014 నుంచి 19 వరకు సాఫీగా...

2014-19 అప్పటి టీడీపీ హయాంలో ఎస్‌జీఎఫ్ క్రీడలు కొంతవరకు సాఫీగానే జరిగాయి. మండలస్థాయి పోటీలకు రూ.30వేల నుంచి 50వేలు, నియోజకవర్గానికి రూ.20వేల నుంచి 50వేలు, జిల్లాస్థాయికి లక్ష రూపాయల నుంచి రూ.1.20లక్షలు, రాష్ట్రస్థాయి పోటీలకు రూ.3లక్షల వరకు ఖర్చు పెట్టేవారు. తొలుత ఈ నిధులను ఎస్‌జీఎఫ్ నిర్వాహ కులే దాతలు సహకారం, తమ సొంత నగదు వెచ్చించి అనంతరం బిల్లులను పెట్టుకుంటే ఆరునెలల్లోపు ప్రభుత్వం విడుదల చేసేది. అయితే, గత వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఎస్‌జీఎఫ్ పూర్తిగా నిర్వీర్యమై పోయిందని నిర్వాహకులు చెపుతున్నారు. క్రీడాదుస్తులు లేకపోవడం, సర్టిఫికెట్లు కూడా ఇవ్వకపోవడం, సరైన భోజన, వసతులు కల్పించకపోవడం వంటి సంఘటనలు అనేకం ఉన్నాయి.

రూ.40లక్షలు విడుదల

ఈ ఏడాది కూటమి ప్రభుత్వం వేగవంతంగా నిధులు విడుదల చేసినా ఎస్‌జీఎఫ్ కార్యదర్శులకు, విద్యాశాఖ అధికారులకు ఉమ్మడి ఖాతాలు లేకపోవడంతో ఈ నిధులు తాత్కాలికంగా నిలిచిపోనున్నాయి. విద్యార్థుల క్రీడా ప్రగతికి ఉపయోగపడాలన్న లక్ష్యంతో పలు నిబంధనలతో అండర్-14, 17కు రూ.28,95,80, అండర్-19కు రూ.9,47,280లను కలిపి జిల్లాకు రూ.40లక్షల వరకు కేటాయించారు. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా ఏయే అంశాలకు ఎంత వెచ్చించాలో కూడా తెలియచేస్తూ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

ఉపయోగం ఇలా..

జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య పేరుతో పాఠశాల, కళాశాలస్థాయిల్లోనే క్రీడాకారులను సిద్ధం చేసి రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు పంపిస్తుంటారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు సర్టిఫికెట్ల గుర్తింపుతోపాటు జాతీయస్థాయిలో రాణించిన వారికి వివిధ కోర్సుల్లో ఉచిత ప్రవేశాలు, ఉద్యోగ నియామకాల్లో 2శాతం రిజర్వేషన్లు కల్పిస్తారు. దీంతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు స్కూల్ గేమ్స్‌లో పాల్గొనడానికి ఆసక్తి కనపరుస్తారు.

దీపావళికి ఉచిత సిలిండర్లు

- రేపటి నుంచి బుకింగ్
- జిల్లా అధికారులకు అందని సమాచారం

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని మహిళలకు ప్రభుత్వం దీపావళి కానుక ప్రకటించింది. సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని దీపావళి పండుగ రోజున అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. దీపం పథకం కింద మహిళల కు ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేయనుంది. అంటే నాలుగు నెలలకు ఒక సిలిండర్ ఉచితం అన్నమాట. ఉచిత సిలిండర్ల బుకింగ్‌కు ఈనెల 24 నుంచి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అయితే, జిల్లా సివిల్ సప్లయిస్ అధికారులకు ఈ ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం అందలేదని అంటున్నారు. ఎంత మందికి పథకం వర్తిసుంది?, ఏ విధంగా అమలు చేస్తారనే సమాచారం వచ్చిన తరువాత వెంటనే చెబుతామని అధికారులు తెలిపారు.

జిల్లాలో 7.87 లక్షల సిలిండర్‌లు :

జిల్లాలో 7,87,483 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో సాధారణ గ్యాస్ కనెక్షన్లు 4,64,871కాగా దీపం పథకం కనెక్షన్లు 2,67,421, ఉజ్వల్ పథకానికి 18,986, సీఎస్ఆర్ కనెక్షన్లు 33,589, కమర్షియల్ కనెక్షన్లు 2616 ఉన్నాయి. వీటిలో ఉజ్వల్ పథకం కింద ఇచ్చే సిలిండర్లకు కేంద్ర ప్రభుత్వం రూ.300 సబ్సిడీ ఇస్తోంది. ప్రస్తుతం సాధారణ సిలిండర్ ధర రూ.840గా ఉంది. దీని లో కేంద్ర ప్రభుత్వం రూ.18.74 సబ్సిడీ ఇస్తోంది.

నిబంధనలు ఇవే..

- దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాల మహిళలకు ఉచిత సిలిండర్లు అందచేస్తారు.
- తెలుపు రంగు రేషన్ కార్డు కలిగి ఉండాలి. దీనిని ప్రామాణికంగా తీసుకుని ఈ పథకాన్ని వర్తింప చేస్తున్నారు.
- గ్రామాల్లో అయితే ఏడాదికి రూ.2లక్షలు, పట్టణాల్లో అయితే రూ. 3 లక్షల వార్షిక ఆదాయం మించకుండా ఉండే కుటుంబాల మహిళలకు ఈ ఉచిత సిలిండర్లు అందచేస్తారు.
- ఈ పథకం కింద లబ్ధిపొందే మహిళలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్థిర నివాసం ఏర్పరచుకుని ఉండాలి.

ప్రభుగిరిపట్నం గ్రామంలోని ఓ సర్వే నంబర్‌లో ఉన్న రెండు సబ్ డివిజన్లలో 4.25 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అది రికార్డుల్లో చుక్కల భూమిగా నమోదై ఉంది. ఆ రెండు సర్వే నంబర్లలోని 3 ఎకరాలను ఓ వ్యక్తి పేరుపైకి పూర్వపు తహసీల్దార్ స్వాతి మ్యుటేషన్ చేశారు. ఈ వ్యవహారంపై ఫిర్యాదులు రావడం, అధికారుల విచారణలో బట్టబయలు కావడంతో నాటి తహసీల్దార్ స్వాతిని సస్పెండ్ చేసిన వ్యవహారంలో ఈ సర్వే నెంబరును కూడా కలెక్టర్ ఫైల్‌లో పొందుపరిచారు. ఇది జరిగి రెండేళ్లయినా నేటికీ వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో ప్రైవేటు వ్యక్తి పేరు మాత్రం తొలగించలేదు.

మరుపూరు గ్రామంలో ఓ భూస్వామికి పేదల మాటున కొంత భూమిని అసైన్‌మెంట్ పేరుతో పంపిణీ చేశారు. అందుకుగానూ గత తహసీల్దార్ వీరవసంతరావు పట్టా కూడా మంజూరు చేశారు. ఆ ప్రభుత్వ భూమిని సదరు భూస్వామికి అప్పగించారు. అయితే ఇటీవల జరిగిన విచారణలో నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూమిని ధారాదత్తం చేశారని నిర్ధారించారు. ఇందుకు బాధ్యులుగా వీరవసంతరావును సస్పెండ్ కూడా చేశారు. కానీ నేటికీ సదరు భూస్వామికి ఇచ్చిన పట్టాను రద్దు చేయలేదు. ప్రభుత్వ భూమిని తిరిగి రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోలేదు.

తప్పులు తేల్చారు..
మరి దిద్దుబాటు ఏదీ?

- పొదలకూరులో భారీగా భూ అక్రమాలు
- గత ఐదేళ్లలో వందల సంఖ్యలో మ్యుటేషన్లు
- ప్రభుత్వ భూముల స్థానంలో మరొకరి పేర్లు
- నాడు 8 మంది తహసీల్దార్ల విచారణలో బట్టబయలు
- తాజాగా వెలుగులోకి వచ్చిన మరికొన్ని అక్రమాలు
- ఆ తప్పులను ఇంకా సరి చేయని రెవెన్యూ శాఖ

నెల్లూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో పొదలకూరు మండలం భూఅక్రమాలకు కేరాఫ్‌గా మారిపోయింది. అధికారమే అండగా వైసీపీ నేతలు చెలరేగిపోయారు. ప్రభుత్వ భూములను ఇష్టానుసారంగా తమ పేర్లపైకి ఎక్కించుకున్నారు. ఇందుకు తహసీల్దార్లు కూడా సహకరించడం తో అక్రమాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. 2020-22 మధ్య రెండేళ్ల పాటు పనిచేసిన అప్పటి తహసీల్దార్ స్వాతిపై వచ్చిన ఆరోపణలకు లెక్కలేదు. టీడీపీ నేతలు కలెక్టరేట్‌ను ముట్టడిస్తే గానీ నాటి ఉన్నతాధికారులు స్పందించ లేదు. విచారణకు ఆదేశించగా అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. వీటిని చూసిన ఉన్నతాధికారులే విస్తుపోయారు. ముందు తహ సీల్దార్‌ను సస్పెండ్ చేశాక పూర్తిస్థాయి విచారణకు ఎనిమిది మంది తహసీల్దార్లను విచారణాధి కారులు నియమించడం గమనార్హం. ఒక్కో తహసీల్దార్ రెండేసి గ్రామాల చొప్పున జరిపిన విచారణలో వందల మ్యుటేషన్లు అక్రమంగా జరిగినట్లు నిర్ధారించారు. ఆ నివేదికలను నాటి ఉన్నతాధికారులకు అందజేశారు. కానీ వైసీపీ ప్రభుత్వం ఉన్నన్ని రోజులూ ఈ నివేదికలు బయటకు రాలేదు. అయితే అక్రమాలు నిర్ధారించాక కూడా వెబ్‌ల్యాండ్‌లో మారిన రికార్డులు ఇంకా అలానే ఉన్నాయి. ప్రభుత్వ భూముల స్థానంలో ప్రైవేటు వ్యక్తుల పేర్లు చేర్చగా ఇప్పటికీ వాటిని తొలగించలేదు. కేవలం రెడ్ మార్క్‌లో పెట్టి వదిలేశారు. తాజాగా అదే మండలంలో మరో తహసీల్దార్ వీరవసంతరావు సస్పెండ్ అయ్యారు. వైసీపీ ప్రభుత్వం చివరి ఏడాది కాలంలో అనేక అక్రమాలు జరిగినట్లు నిర్ధారించిన ఉన్నతాధికారులు అప్పటి తహసీల్దార్‌పై చర్యలు తీసుకున్నారు. అయితే ఇప్పుడు విచారణలో నిబంధనలకు విరుద్ధంగా పట్టాలు ఇచ్చారని తేల్చినా ఆ పట్టాలు రద్దు చేయడం గానీ, ఆ ప్రభుత్వ భూమిని సదరు అనర్హుల నుంచి స్వాధీనం చేసుకోవడం గానీ జరగలేదు. దీంతో అక్రమాలు నిగ్గు తేల్చి ప్రయోజనమేమిటన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

సూత్రధారులపై చర్యలేవి..?

పొదలకూరు మండలంలో అనేక భూ అక్రమాలు వెలుగులోకి వచ్చినా కేవలం తహసీల్దార్లపై చర్యలు తీసుకొని సరిపెడుతున్నారు. సూత్రధారులపై మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఒక వ్యక్తి అసైన్‌మెంట్ పట్టా పొంది ప్రభుత్వ భూమిని తీసుకున్నారంటే ఆ వ్యక్తి తాను పేదవాడిగా ప్రభుత్వానికి తెలియజేసి ఉండాలి. అలానే కొందరు ఫేక్ పట్టాలు పొంది ప్రభుత్వ భూమిని కొట్టేశారు. వీరంతా ప్రభుత్వాన్ని మోసం చేసినవారవుతారని న్యాయ నిపుణులు చెబుతున్నారు. అలానే ప్రభుత్వ భూమిని తమ పేర్లపైకి దొడ్డిదారిన ఎక్కించుకున్నవారు కూడా అనేక మంది ఉన్నారు. ఇటువంటి వారిపై చట్ట పరంగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకునేందుకు అవకాశమున్నట్లు చెబుతున్నారు. కానీ జిల్లా అధికారులు మాత్రం వీరిని వదిలేస్తున్నారు. ప్రభుత్వాన్ని మోసం చేసి రికార్డులు మార్పించున్న వ్యక్తులు, ప్రభుత్వ భూములు అక్రమంగా పొందిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తే మరో చోట ఇటువంటి అక్రమాలు చేయాలంటే ఇతరులు భయపడతారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పాఠశాల విద్య బలోపేతం చేస్తా!

- ఉపాధ్యాయ సంఘాలూ సహకరించాలి
- టెన్త్ ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలుపుతా
- నూతన డీఈవో బాలాజీరావు వెల్లడి

- వివరాలు 8లో..



కలెక్టర్‌ను కలిసిన డీఈవో బాలాజీరావు

పారిశుధ్యం మెరుగు.. ఎస్ఎంసీలదే బాధ్యత

- బడుల్లో మెరుగైన పరిశుభ్రతకు ప్రణాళిక
- ప్రత్యేకంగా యాప్, ప్రతి కమిటీకి గుర్తింపు సంఖ్య
- ప్రతి బుధ, శుక్రవారాల్లో పనుల పరిశీలన

పరిసరాల్లో చెత్తాచెదారం, మరుగుదొడ్లలో దుర్వాసన, అపరిశుభ్రత.. ఇదీ ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితి. ఈ పరిస్థితుల నుంచి విద్యార్థులకు ఉపశమనం కలిగించేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. బడుల్లో పారిశుధ్యం మెరుగునకు కార్యాచరణ సిద్ధం చేసింది. పారిశుధ్య మెరుగు బాధ్యత ఇక స్కూల్ యాజమాన్య కమిటీలకు (ఎస్ఎంసీ) అప్పగించింది. ఇందుకోసంగా ఓ ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. అదేవిధంగా ప్రతి పాఠశాలకు ఒక గుర్తింపు సంఖ్యనూ కేటాయించనున్నారు.

8



డ్రోన్ ద్వారా దోమల మందు పిచికారీ చేయిస్తున్న సిబ్బంది

డ్రోన్ ఎగిరొచ్చె..
మందు పిచికారీ చేసె!

ఇళ్లను మురుగు, వర్షపునీరు చుట్టేశాయి. రోజులతరబడి నిల్వ ఉండటంతో పాచి పట్టి దోమలకు ఆవాసాలుగా నిలిచిపోయాయి. వీటి నియంత్రణకు మందు పిచికారీ చేయాలంటూ మురుగులో నడవాలి. అందులో ఏముంటోందో ఏమోననే భయం. ఇంకేముంది.. ఠక్కున డ్రోన్ గుర్తుకు వచ్చింది. వెంటనే దానిని తెచ్చి మందు నీటిగుంటలో మందు పిచికారీ చేయించారు. నెల్లూరు రూరల్ మండలం బుజబుజనెల్లూరులో కార్పొరేటర్ నరసింహగిరి శుక్రవారం కార్పొరేషన్ సిబ్బంది సహకారంతో డ్రోన్ ద్వారా దోమల మందు పిచికారీ చేయించారు.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)

నచ్చిపోదురుగాక..
ఇది బస్‌స్టేషనా..?

మండల కేంద్రంలోని పాత బస్టాండు సెంటరులో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్‌స్టేషన్ నిరుపయోగంగా ఉన్నది. ఇక్కడ కనీస వసతులు లేకపోవడంతో ప్రజలు బస్సుల కోసం స్టేషన్‌కు వెళ్లక రోడ్డుపైనే నిరీక్షిస్తున్నారు. రూ.10లక్షల వ్యయంతో కొన్నేళ్ల కిందట నిర్మించిన దీనిలో అధికారులు వసతులు ఏర్పాటు చేయక పోవడంతోనే ఈ దుస్థితి నెలకొందని స్థానికులు, గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వారు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి)


వలేటివారిపాలెంలోని బస్‌స్టేషన్ దుస్థితి



పండక్కీ, పబ్బానికీ, సిరులు చిందించే ఉత్సవాలకూ చేనేత చీరకట్టడం తెలుగు మహిళల సంప్రదాయం. పెళ్లి అనగానే మగువలకు మొదట గుర్తుకు వచ్చేది చీరలే. విభిన్న రంగులు.. చూడముచ్చటైన చీరలను అందిస్తూ నారీమణుల మనసు దోచుకుంటోంది పాటూరు గ్రామం. నాలుగేళ్ల కిందట పోచంపల్లి చీర పేటెంటు హక్కు పొంది తనదైన విశిష్టశైలిని నిరూపించుకొన్న రీతిలోనే.. పాటూరు చీరలు తళుకులీనుతూ సుందరమైన మన్నిక కలిగినవిగా గుర్తింపు పొందాయి. సుమారు అర్ధశతాబ్దం నుంచి పాటూరు చీరల వైభవం సాగుతోంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చేనేత ఈ చీరలు గుర్తింపు పొందాయి. తెలుగువారున్న ప్రపంచదేశాలన్నింటిలో పాటూరు చీర తన వైభవాన్ని చాటుకుంది. పాటూరు చీర మహిళల మేనుపై కాంతులీనుతోంది. నూలువడికి చేనేత చీరలు తయారుచేసిన చేతులు నేడు పట్టు, జరీ చీరల తయారీలోనూ ప్రత్యేకతను సంతరించుకుంటున్నాయి.

- కోవూరు (ఆంధ్రజ్యోతి)

పనికి తగ్గ ధర లేదు



రంగులు,మెటీరియల్ ధరలు బాగా పెరిగాయి. పెద్ద కంపెనీల చీరల ముందు చేనేతల చీరలు వెలవెల పోతున్నాయి. ఫ్యాక్టరీల్లో తయారైన చీరలు నాజూగ్గా ఉండటంతో మహిళలు వాటి వైపు మొగ్గు చూపుతున్నారు. చేనేత కార్మికుల పనికి తగ్గ ధర పలకడం లేదు.

- పృథ్వీ యానాదయ్య

పాటూరు పట్టు..
మగువలు మురిసేట్టు!

- దేశ, విదేశాల్లో ప్రత్యేక స్థానం
- నేటి కాలంలోనూ పోటీకి తట్టుకుని నిలిచిన వైనం

దుస్థితిలో చేనేత కార్మికుల బతుకులు

నేతల వాగ్దానాలు నెరవేర్చాలని వేడుకోలు

పాటూరులోని చేనేత కార్మికులు నాలుగు చీరలను ఒకే రకంగా, ఒకే పర్యాయం నేస్తారు. నాలుగు చీరలు తయారుచేసేందుకు నూరవ నెంబరు నూలు కడ్డీలు ఆరు, చీరంచుల కోసం 80వ నెంబరు నూలు కడ్డీలు రెండింటిని ఉపయోగిస్తారు. ఆ కడ్డీలకు రంగుల అద్దకం చేస్తారు. ఆ తర్వాత కడ్డీలను ఆరబెట్టి రాట్నంపై తోడి నూలుగా తయారుచేసి పడుగుపోస్తారు. పడుగుకు గంజి, కొన్ని రకాల నూనెలు కలిపి పాగడా తయారుచేస్తారు. అచ్చుకు పాగడాను అమర్చి అల్లుపడుతారు. మగ్గం మీదకు చేర్చి అల్లుకు అంచు, బార్డరు తీర్చిదిద్దుతారు. బార్డరు తయారీకి లాగడం, డాబీ, జాకాడు అనే పరికరాల్ని ఉపయోగిస్తారు. అంచులకు పలు డిజైన్లను రూపొందిస్తారు. నెమలి, పుష్పాలు, చిలుకలు, మామిడిపిందెలు, నర్తకి వంటి అంచుల్లో ప్రాముఖ్యత సంతరించుకొన్నాయి. చీర ధరను దృష్టిలో ఉంచుకుని జరీ కల్పుతారు. జరీల్లో ఉన్న మార్పుల తేడా వల్ల చీర ధరను నిపుణులు అంచనా వేస్తారు. నాలుగు చీరలు తయారుచేసేందుకు పోగులపట్టును ఒకటిన్నర కిలో వాడతారు. పోగుల పట్టును బెంగళూరు, కంచి, చెన్నైలో కొనుగోలు చేస్తామని వస్త్ర వ్యాపారులు తెలిపారు. పోగుల పట్టుకు తాము అనుకున్న రంగుల్ని అద్దించి తీసుకువచ్చి ఆరబెడ్తారు. పట్టును రాట్నంపై తోడి కండెకు చుట్టుతారు. ఒక చీరకోసం ఐదు గజాల పొడవు నూలు, పేకన పట్టును విభజించి నేతకు ఉపక్రమిస్తారు. మధ్యలో వివిధ రకాల డిజైన్లు పుటలు వేస్తూ నేస్తారు. ఆరో గజానికి అంచు రంగు ఉండే రంగును మధ్యలోని పడుగుకు అద్దకం చేస్తారు. ఆరుగజాల పొడుగును క్రమంగా నీటిలో నానబెట్టి మురికిని, గంజిని పోగొడ్తారు. అనంతరం రంగులు కలిపిన పాత్రలో పొడుగును ఉంచుతారు. పొడుగుకు ఎలాంటి పొడలు, అరమరకలు లేకుండా జాగ్రత్తలు తీసుకొంటారు. రెండు సార్లు బాగా శుభ్రం చేసిన తరువాత తిరిగి అద్దకం చేస్తారు. గంజి పోసి నూలు ఆరకుండా దువ్వడం ప్రారంభిస్తారు. రంగు అద్దకంలోనే పాటూరు చేనేత కార్మికుడు తనదైన విశిష్టశైలిని కనపరస్తుండంతో చీరకు అందం ఏర్పడుతోంది. చీరకొంగును కూడా రంగులతో అద్దకం చేయడం పాటూరులోనే ప్రారంభమైంది. సిద్ధం చేసిన చీర కొంగుకు పేకన కవ్వను అమర్చుతారు. కవ్వకు వడి కట్టి 1800 కవ్వాలకు 1800 కడుగుల్ని ఏర్పాటుచేస్తారు. వాటితో టంగోసుపోగుతో డిజైను ఆధారంగా అల్లకాన్ని తీర్చిదిద్దడం పాటూరు నేత కార్మికుని ప్రత్యేకతగా చెబుతారు. 48పుల్లల 'డాబీ'లతో పవిట చెంగును జాకాడవల్లు అనే పరికరంతో నయనానందకరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడి వ్యాపారులు వస్త్ర ప్రపంచంలో వచ్చే మార్పులకు అనుగుణంగా ఆధునిక పద్ధతుల్లో చీరల్ని తయారుచేస్తున్నారు.


అబ్బో ఎన్ని రంగుల చీరలో

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం..



ప్రభుత్వం చేనేత కార్మికులకు ఎలాంటి ఆర్థిక సహాయం అందించకపోవడంతో ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నాం. రాజకీయ నాయకులు మమ్మల్ని ఆదుకుంటామని పదే పదే వాగ్దానాలు చేస్తారు. మొదట నుంచి నేత మీదనే ఆధారపడ్డాం. ఇప్పుడు ఏ పనీ చేయలేని పరిస్థితిలో ఉన్నాం. చేనేతనే నమ్ముకున్నాం. కనీసం కూలీ గిట్టుబాటు కానప్పటికీ చీరల్ని నేయాలనే తపనతో రంగుల చీరల్ని నేస్తున్నాం.

-పోలిశెట్టి లత, పాటూరు

ఆశగా ఎదురుచూస్తున్నాం..

చేనేత మీదున్న మమకారంతో కడ్డీ అంచురకం చీరలు నేస్తున్నాం. కూలీ కూడా గిట్టుబాటు కావడం లేదు. వారానికి ఐదు చీరలు నేస్తున్నాం. వస్త్ర వ్యాపారులు చెల్లించే కూలీచాలడం లేదు. అచ్చు, అల్లు, అతుకుడు పని కలిపి లెక్కిస్తే కూలీ కూడా గిట్టుబాటు లేదు. ప్రభుత్వం ఎలాంటి ఆర్థిక సహాయం అందించడంలేదు. సీఎం చంద్రబాబు గత ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాన్ని నెరవేరుస్తారని ఎదురుచూస్తున్నాం.

- బైనా జనార్దన్, గుమ్మళ్ళదిబ్బ, కోవూరు




మగ్గం నేస్తున్న చేనేత కార్మికురాలు

నేతన్నలో ఆవేదన

దినమంతా కష్టపడి నేత నేసినా కూలీ కూడా గిట్టుబాటు కావడం లేదని చేనేత కార్మికులు వాపోతున్నారు. పాటూరు, కోవూరు, గుమళ్ళదిబ్బ, గంగవరం, ఇనమడుగు గ్రామాల్లో చేనేత కార్మికుల కుటుంబాలు పెద్దసంఖ్యలో ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పాటూరు చేనేత చీరలకు మంచి గిరాకీ ఉంది. ఇక్కడ ఇంటింటా చీరల వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇక్కడ తయారవుతున్న గోల్డ్, సిల్వర్ కడ్డీ, టిష్యూ, రోబో, కలర్ జరీ, మల్టీ కలర్స్ జరీబూటా రకపు చీరలకు గిరాకీ పెరిగింది. కోవూరు పరిసర ప్రాంతాల్లోనే కాకుండా ఆత్మకూరు, వింజ మూరు, కలిగిరి, ఏఎస్‌పేట మండలా ల్లోని చేనేత కార్మికుల ఇళ్ళకు వస్త్ర వ్యాపారులు మెటిరియల్ సరఫరా చేసి చీరలు నేయిస్తున్నారు. ఒక్క చీర నేసేందుకు రెండు రోజులు పడుతోంది. ఐదు చీరల్ని నేసేందుకు వారం పడుతుంది. కూలీకి వెళ్తే రోజుకు రూ.500 సంపాదించే కాలంలో రేయింబవళ్లు కష్టపడి నేత నేస్తే రోజుకు రూ. 300 కూడా గిట్టుబాటు కావడంలేదని చేనేత కార్మికులు వాపోతున్నారు.


అమ్మపాలెంలో ఇంటింటికి వెళ్లి వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

జ్వరాలను నిర్లక్ష్యం చేయొద్దు

- జిల్లా మలేరియా వైద్యాధికారి హుస్సేనమ్మ

వలేటివారిపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వైరల్ జ్వరాలు పట్ల ప్రజలు నిర్లక్ష్యం చేయవద్దని జిల్లా మలేరియా వైద్యాధికారి హుస్సేనమ్మ, జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు తెలిపారు. అమ్మపాలెం, కాకర్ల వారిపాలెం, చుండి గ్రామాల్లో విజృంభిస్తున్న జ్వరాలపై శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. కలెక్టర్, డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు జిల్లా సబ్ యూనిట్ ఆఫీసర్ విజయ్‌చంద్, కందుకూరు డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రియ వదలతో కలిసి అమ్మపాలెంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని వారు పరిశీలించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఫీవర్ కేసులు, పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాధులతో కలిగే నష్టాలను వివరించారు. వారి వెంట స్థానిక వైద్యాధికారి మణిదీపిక, సిబ్బంది ఉన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాష్ట్రంలో తీరిన స్టాంపు పేపర్ల కొరత

అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్టాంపు పేపర్ల కొరత తీరింది. శుక్రవారం రాష్ట్రానికి కొత్త స్టాంపు పేపర్లు వచ్చాయి. నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపర్లు 20 లక్షలు, 100 రూపాయల స్టాంపు పేపర్లు 10 లక్షలు, 50 రూపాయల స్టాంపు పేపర్లు 10 లక్షలు వచ్చాయి.

పాఠశాల విద్య బలోపేతం చేస్తా!

- నూతన డీఈవో బాలాజీరావు

నెల్లూరు (విద్య), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పాఠశాల విద్యను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ రాజా బాలాజీరావు తెలిపారు. నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం ఆయన డీఈవోగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బాలాజీరావు మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ఉపాధ్యాయ సంఘాలు కూడా తనకు పూర్తి సహాయ, సహకారాలు అందచేయాలని కోరారు. విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసేలా ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేయడంతో పాటు ఈ ఏడాది టెన్త్ ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లాకు బదిలీపై వెళుతున్న రామారావు, నూతన డీఈవోలు ఒకరినొకరు అభినందనలు తెలియచేసుకున్నారు. డీఈఓలకు ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి, విద్యా శాఖ ఏడీలు, సూపరింటెండెంట్లు, కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయ సంఘం నేతలు అభినందనలు తెలిపారు. అలాగే నూతన డీఈఓ బాలాజీరావు కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.


అధివాసాంగ హోమం చేస్తున్న రుత్వికులు

సౌభాగ్య సరస్వతి ఆలయంలో
వైభవంగా ప్రతిష్ఠాపన ఉత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని పప్పులవీధిలో గల సౌభాగ్య సరస్వతీ ఆలయం విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు శుక్రవారం కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి, శక్తి పీఠం అధిపతి రమ్యానంద భారతీ నేతృత్వంలో ఉదయం యాగశాల ప్రవేశం, కలిశ స్థాపన, మండపా రాధనలు, హోమాలు జరిగాయి. అనంతరం భక్తులు నువ్వుల నూనెతో బారులుతీరి నూతన విగ్రహాలకు తైలాభిషేకం చేశారు. ఆ తర్వాత అన్న ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం యాగశాలలో పూజలు, హోమాలు జరిగాయి. ధాన్యా దివాసం కార్యక్రమంలో భక్తులు బియ్యం, వడ్లు సమర్పించారు. పీఠాధిపతి అనుగ్రహ భాషణం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్ర మాలు కనువిందు చేశాయి. ఆలయ ప్రధాన అర్చకుడు మాచవోలు రమేష్ శర్మ, మేనేజర్ అనూరాధ, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.


ఆకట్టుకున్న బాలికల నృత్య రూపక ప్రదర్శన

మూలస్థానేశ్వరాలయంలో
రేపటి నుంచి పవిత్రోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వరాలయంలో ఆదివారం నుంచి ఈ నెల 29వరకు పవిత్రోత్సవాలు జరుగుతాయని ఆలయ సహాయ కమిషనర్, ఈవో జే శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం అంకురార్పణ, 28వతేదీ విశేష సంధి పూజ, విశేష ద్రవ్యాలతో హోమం, పవిత్ర సమర్పణ జరుగుతాయని తెలిపారు. 29వతేదీ యాగశాల పూజ, మండలేశ్వర పూజలు, మహాపూర్ణాహుతి, మహాదీపారాధన, అలంకార దర్శనం, రాత్రి ప్రదోషకాల పూజలు, చిన్న వెండి నందిపై ప్రాకారోత్సవం జరుగుతాయన్నారు. భక్తులు అందరూ తరలిరావాలని కోరారు.

మల్టీపర్పస్ పీఏసీఎస్‌ల
ఏర్పాటుకు జిల్లా కమిటీలు

అమరావతి (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ ప్రైమరీ అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటీలు, డెయిరీ, ఫిషరీస్ సొసైటీల ఏర్పాటు కోసం జిల్లా స్థాయిలో జాయింట్ వర్కింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర పథకం 'సహకార్ సే సమృద్ధి'లో భాగంగా జిల్లా సహకార అభివృద్ధి కమిటీలకు సబ్ కమిటీలుగా జిల్లాస్థాయి కమిటీలు పని చేయనున్నాయి. దీనికి జాయింట్ కలెక్టర్ స్థాయి కంటే తక్కువ కాని అధికారులను చైర్మన్లుగా నియమించాలని ప్రభుత్వం సూచించింది. సహకార సేవలు విస్తరించని గ్రామాలు, పంచాయతీలు, ప్రాంతాల్లో కొత్త మల్టీపర్పస్ ప్రైమరీ అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటీల ఏర్పాటుకు సంబంధించిన కార్యకలాపాలను నిర్వహించడానికి ఈ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

రచ్చకెక్కిన ఎస్సీ కార్పొరేషన్

(7వ పేజీ తరువాయి)

కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీని ఆదేశించింది. దీంతో విచారణాధికారిగా నియమితులైన ఆ సంస్థ జనరల్ మేనేజర్ సునీల్‌రాజ్‌కుమార్ కార్పొ రేషన్‌లో అక్రమాలు జరిగాయని, అక్రమ పదో న్నతులు జరిగా యంటూ సంస్థ ఎండీకి నివేదిక సమర్పించినట్లు తెలిసింది. దీంతో ఎస్సీ కార్పొ రేషన్‌లో ఈడీగా పని చేసిన సారయ్యను, ఈవో సెల్విని సస్పెండ్ చేశారు. అదేవిధంగా ఇద్దరు టైం స్కేల్ ఉద్యోగులకూ రివర్షన్ ఇచ్చారు.

నివేదిక కలెక్టర్‌కు పంపాం

ఎస్సీ కార్పొరేషన్‌లో జరిగిన విచారణకు సంబం ధించి విచారణాధికారి ఇచ్చిన నివేదికను కలెక్టర్‌కు పంపాం. అక్కడ నుంచి ఎస్సీ కార్పొరేషన్ ఎండీకి నివేదిక చేరుతుంది. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణా లు పొంది జేసీబీలు, ఇన్నోవా కార్లు తదితరాలు పొందిన వారి నుంచి రుణాల రికవరీ చేస్తాం.

- డాక్టర్ నిర్మలాదేవి, ఈడీ ఎస్సీ కార్పొరేషన్

పారిశుధ్యం మెరుగు..
ఎస్ఎంసీలదే బాధ్యత

- బడుల్లో మెరుగైన పరిశుభ్రతకు ప్రణాళిక
- ప్రత్యేకంగా యాప్, ప్రతి కమిటీకి గుర్తింపు సంఖ్య
- ప్రతి బుధ, శుక్రవారాల్లో పనుల పరిశీలన

సంగం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 2061 ప్రాథమిక, 256 ప్రాథమికోన్నత, 295 ఉన్నత పాఠశాలలు ఉండగా, సుమారు 1.82 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆయా పాఠశాలల్లో పరిసరాలు, మరుగుదొడ్ల పరిశుభ్రతను ఇప్పటి వరకు ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించి అందులో రోజుకు మూడు సార్లు మరుగుదొడ్ల ఫొటోలు అప్‌లోడ్ చేసేవారు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. అంతేగాక పాఠశాలల యాజమాన్య కమిటీలను రద్దు చేసి తల్లిదండ్రుల పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలు నెలవారీ జరిగే సమావేశాల్లో పాల్గొని తీర్మానాలపై సంతకాలు చేయడం, ఉత్సవ విగ్రహాల్లా ఉండటం మినహా ఎటువంటి అధికారాలు, బాధ్యతలు ఉండేవికావు. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం యాజమాన్య కమిటీలను పునరుద్ధరించింది. ఆగస్టులో పాఠశాలల వారీగా ఎన్నికలు నిర్వహించి నూతన కమిటీలను కూడా ఏర్పాటు చేసింది. అంతేగాక ఈ కమిటీలకు కొన్ని బాధ్యతలు అప్పగించడానికి కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ప్రతి బుధ, శుక్రవారాల్లో కమిటీ సభ్యులు పాఠశాలలకు వచ్చి మరుగుదొడ్లు, ఇతర పారిశుధ్య పనులను పరిశీలించి ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక్కో కమిటీకి ప్రత్యేక ఐడీ, పాస్‌వర్డ్ కేటాయించింది.


పాఠశాల ఆవరణలో శుభ్రం చేస్తున్న సిబ్బంది

ఎస్ఎంసీలతోపాటు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్

ఒక్కో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలో సగటున 15 నుంచి 20 మంది సభ్యులు ఉంటారు. వారితోపాటు సచివాలయ సంక్షేమ సహాయకులు పారిశుధ్య పర్యవేక్షణ పనుల్లో భాగస్వాములు కానున్నారు. యాప్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేసేలా కమిటీ సభ్యులకు శిక్షణ కూడా ఇవ్వనున్నారు. ఎక్కడైనా మరుగుదొడ్ల మరమ్మతులు, ఇతర సమస్యలు ఉంటే వెంటనే ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు నివేదించి సమస్యను పరిష్కరించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో పాఠశాలల్లో సమస్యలకు పరిష్కారం లభించినట్లేనని విద్యార్థులు, ఉపాధ్యాయులు భావిస్తున్నారు.

పోలీసు క్రీడల్లో తొలి మూడు పతకాలు మనవే!

● క్రీడాకారులకు ఎస్పీ అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా పోలీసు జుడో క్లస్టర్ గేమ్స్-2024లో మొదటి మూడు పతకాలను జిల్లాకు చెందిన చరణ్‌తేజ, రాజశేఖర్, శ్రావణి సాధించారు. వారిని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ జీ కృష్ణకాంత్ అభినందించారు. ఈ సంవత్సరం జూన్ 24 నుంచి 30 వరకు అస్సాంలో 9వ ఆల్ ఇండియా పోలీస్ జుడో క్లస్టర్ గేమ్స్-2024 నిర్వహించారు. రాష్ట్రం నుంచి పాల్గొన్న పోలీసు క్రీడాకారుల్లో జిల్లాకు చెందిన ఏఆర్ హెచ్‌సీ కే మురళీధర్ కుమారుడు ఏఆర్ పీసీ కే చరణ్‌తేజ పెన్‌కాక్ సిలాట్ విభాగంలో బంగారు పతకం సాధించారు. సర్టిఫికెట్‌తోపాటు రూ.3 లక్షల నగదు, మూడు ఇంక్రిమెంట్స్‌ను బహుమతిగా పొందారు. రైతు మస్తాన్‌రెడ్డి కుమారుడు హెడ్‌కానిస్టేబుల్ ఎం రాజశేఖర్ పెన్‌కాక్ సిలాట్ విభాగంగాలో రజత పతకం సాధించారు. సర్టిఫికెట్, రూ.2లక్షల నగదు, రెండు ఇంక్రిమెం ట్లను బహుమతిగా పొందారు. కావలి వీఆర్‌పే తిరుమతి కుమార్తె ఏఆర్ ఉమెన్ కానిస్టేబుల్ ఏ శ్రావణి కరాటేలో కాంస్య పతకం సాధించారు. సర్టిఫికెట్, రూ.1 లక్ష నగదు, ఒక ఇంక్రిమెంట్ బహుమతిగా గెలుచుకున్నారు. క్రీడాకారులను అభినంధించిన ఎస్పీ మాట్లాడుతూ పోలీసు క్రీడాకారులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పిస్తామని చెప్పారు. అసోంలో జరిగిన క్రీడల్లో రాష్ట్రానికి 9 పతకాలురాగా అందులో మూడు నెల్లూరు జిల్లాకు రావడం, జిల్లా నుంచి పాల్గొన్న ముగ్గురూ పతకాలు సాధించడం ఆనందం గా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సౌజన్య పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుల అరెస్ట్

నెల్లూరు రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఓ మహిళపై అత్యాచారానికి పాల్పడ్డ కేసులో నిందితులను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నెల్లూరు రూరల్ సీఐ వేణు అందించిన వివరాల మేరకు... మండలంలోని కనుపర్తిపాడుకు చెందిన 19 ఏళ్ల యువతి ప్రతీ ఆదివారం చర్చికి వెళ్తుంది. ఈ క్రమంలో దారా సారా అనే మహిళతో పరిచయం ఏర్పడింది. తరుచూ ఆమె ఇంటికి వెళ్తున్న క్రమంలో సారా కొడుకు నిఖిల్‌తోనూ పరిచయం అయింది. తల్లి ఇంట్లోలేని సమయంలో యువతిపై నిఖిల్ అత్యాచారానికి పాల్పడ్డాడని, అతని స్నేహితులు సునీల్, సన్నీ, సెర్లీ నవీన్ కూడా అత్యాచారానికి ఒడిగట్టారు. ఈ విషయాన్ని ఇటీవల బాధితురాలి పిన్ని గుర్తించి, ఈ నెల 22వ తేదీన తమకు ఫిర్యాదు చేసినట్లు సీఐ వెల్లడించారు. వైద్య పరీక్షల అనంతరం కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేశామని తెలిపారు.

వ్యాన్ - కారు ఢీ : ఒకరికి గాయాలు

సంగం, అక్టోబరు 25 (ఆంధ్యజ్యోతి): మండల పరిధిలోని కలిగిరి రహదారిలో మరమ్మతులకు గురైన టాటా ఏసీ వ్యాన్‌ను లాక్కొస్తుండగా వెనుక వైపు నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొంది. వివరాలిలా ఉన్నాయి. కలిగిరి వద్ద మరమ్మతులకు గురైన టాటా ఏసీ వ్యాన్‌ను రికవరీ వ్యాను నెల్లూరుకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో వెనుక వైపు నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో వ్యాన్ దెబ్బతింది. కారు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం

నెల్లూరు(క్రైం) (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని మాగుంట లేవుట్ అండర్ బ్రిడ్జి సమీపంలో శుక్రవారం రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. 55-56 సంవత్సరాల వయసున్న వ్యక్తి మృతి చెందాడని, మృతదేహంపై తెలుపు రంగు హాఫ్ హ్యాండ్ షర్ట్, ఎరుపు, పసుపు రంగు గళ్ల కలిగిన టవల్ ఉన్నాయని తెలిపారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్ఐ మాలకొండయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అటవీ శాఖ సిబ్బందిపై ఎలుగుబంట్ల దాడి



ఎలుగుబంటి దాడిలో గాయపడిన రోశయ్య

మర్రిపాడు (ఆంధ్ర జ్యోతి) : అటవీ శాఖ సిబ్బందిపై ఎలుగు బంట్లు దాడి చేయడంతో ఒకరికి గాయాలైన సంఘటన కదిరి నాయుడు పల్లి అడవిలో శుక్ర వారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. రోజువారి కార్యక్ర మంలో భాగంగా బేస్ క్యాంప్ సిబ్బంది అడవిలో పెట్రో లింగ్ నిర్వహి స్తుండగా ఒక్కసారిగా చెట్లపొద ల్లో నుంచి రెండు ఎలుగుబంట్లు రోశయ్య అనే వ్యక్తిపై దాడి చేశాయి. దీంతో తోటి వారంతా కలిసి ఎలుగు బంట్లను చెదరగొట్టటంతో పారిపోయాయి. దాడిలో రోశయ్యకు స్వల్ప గాయాలు కావడంతో మర్రిపాడు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స నిర్వహించారు.

ట్రాక్టర్ బోల్తా : మెకానిక్ మృతి

అనంతసాగరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మినగల్లు పంచాయతీ నల్లరాజుపాళెం వద్ద ఉత్తర కాలువలో ట్రాక్టర్ బోల్తాపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకొంది. ఆత్మకూరుకు చెందిన ట్రాక్టర్ మెకానిక్ సాధిక్(47) నల్లరాజుపాళెంలోని ఓ తోటలో ట్రాక్టర్‌ను రిపేరు చేసి ట్రైల్ రన్ కోసం ఉత్తర కాలువపై వెళుతుండగా ప్రమాదవశాత్తు కాలువలో పడింది. ఈ ఘటనలో సాధిక్ అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతసాగరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కాలువలో నుంచి మృతదేహాన్ని వెలికితీసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సూర్యప్రకాష్‌రెడ్డి తెలిపారు.

కట్నం కోసం వేధింపులపై కేసు

నెల్లూరు(క్రైం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): భార్యను అదనపు కట్నం కోసం వేధించిన ఘటనలో భర్త, అత్తింటివారిపై వేదాయపాళెం పోలీసులు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. నేతాజీ నగర్‌కు చెందిన షేక్ నూరిన్‌కు కావలికి చెందిన షాదాబ్‌తో గతేడాది వివాహం జరిగింది. కట్నకానుకల కింద రూ.2 లక్షలు, 12 సవర్ల బంగారం, కేజీ వెండి వస్తువులు ఇచ్చారు. వివాహమైన నాలుగు నెలల నుంచే భర్త, అత్తింటివారు అదనపు కట్నం కోసం నూరిన్‌ను వేధించడం ప్రారంభించారు. తల్లిదండ్రుల వద్దే ఉంటున్న నూరిన్ వద్దకు కొద్ది రోజుల తర్వాత భర్త వచ్చి ఇక నుంచి కలిసి ఉంటా నంటూ నమ్మబలికాడు. వ్యసనాలకు బానిసైన షాదాబ్ భార్య పేరుపైనున్న క్రెడిట్‌కార్డు, బ్యాంకు అకౌంట్ల నుంచి రూ.5లక్షలు వాడుకుని కావలికి వెళ్లిపోయాడు. ఆమె ఫోన్ చేస్తున్నా పట్టించుకోలేదు. దీంతో బాధితురాలు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కలుషిత నీటితో చేపలు మృతి



కోనేరులో తేలియాడుతున్న చేపల కళేబరాలు

అల్లూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కలుషిత నీటి సరఫరా అవుతుండటంతో శుక్రవారం అల్లూరు కోనేరులోని చేపలు మృతి చెందాయి. శుక్రవారం ఉదయం అల్లూరు చెరువులో నుంచి వస్తున్న నీరు నల్లటి రంగుతో ఉన్నాయి. ఈ చెరువుకు పైడేరు ఎస్కేప్-2 ఛానల్ నుండి ఏటిఎస్ ఛానల్ ద్వారా నీరు సరఫరా అవుతోంది. కొడవలూరు మండలం జాతీయ రహదారి సమీపంలోని కొన్ని ఫ్యాక్టరీల ద్వారా వెలువడే విషపు నీటిని సమీపంలోని పైడేరులో వదులుతుండటం వల్ల ఈ పరిస్థితి నెలకొందని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ చెరువులోని నీటినే అల్లూరు మండలంలోని పలు ప్రాంతాలకు పైలెట్ ప్రాజెక్టు ద్వారా తాగునీరుగా సరఫరా చేస్తుండడంతో ఏవైనా సమస్యలు ఏర్పడతాయే అని భయాందోళనలకు గురవుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	132
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	262
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7513
వెండి కిలో ధర	రూ. 98,300
వెండి ఒక గ్రాము	రూ.101.30

ఆర్టీసీ బస్సు - కారు ఢీ

ఉదయగిరి రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్న సంఘటన స్థానిక వైఎస్ఆర్ విగ్రహం సర్కిల్ వద్ద శుక్రవారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. కావలి నుంచి ఉదయగిరికి వస్తున్న ఆర్టీసీ బస్సు సీతారామపురం మండలం చిన్నాగంపల్లి గ్రామానికి చెందినవారు పని నిమిత్తం ఉదయగిరికి కారులో వస్తుండగా వైఎస్ఆర్ సర్కిల్ వద్ద గల మలుపు దగ్గర రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతినగా ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. ఈమేరకు ఇరువురు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు.

పంటల నష్ట నివారణపై

రైతులకు అవగాహన కల్పించాలి

● డాక్టర్ శివన్నారాయణ



శివన్నారాయణను సన్మానిస్తున్న కేవీకే సమన్వయకర్త లలితా శివజ్యోతి, శాస్త్రవేత్తలు

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు, వరద లకు పంటలు దెబ్బతినకుండా ఉండేం దుకు అవసరమైన నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలని ఎన్‌జీ రంగా విశ్వ విద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ జీ శివన్నారాయణ సూచించారు. శుక్రవారం ఆయన నెల్లూరులోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)ను సందర్శించారు. వివిధ విభాగాల శాస్త్రవేత్తలు చేపట్టిన క్షేత్రస్థాయి పరిశీలనలు, ప్రదర్శనలు, పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. దత్తత గ్రామాలపై చర్చించారు. కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త డాక్టర్ జీ లలితా శివజ్యోతి, శాస్త్రవేత్తలు కదిరి మోహన్, లోకేష్‌బాబు, కిరణ్‌కుమార్ రెడ్డి, సుజాత తదితరులు పాల్గొన్నారు.



ఈ కుప్పను చూసి డంపింగ్‌యార్డులో చెత్త అనుకుంటే పొరపాటు పడ్డట్లే.. ఇది ఉదయగిరి ఉపాధి హామీ కార్యాలయంలో మెట్ల కింద పడేసిన పాత మస్టర్లు, రికార్డులు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా గత కొన్నేళ్లుగా అవి ఇక్కడే దర్శనమిస్తున్నాయి. ఇటీవల కార్యాలయానికి జిల్లా కలెక్టర్, డ్వామా పీడీ, జిల్లా ఉన్నతాధికారులు వచ్చారు. ఆ సమయంలో వారికి అవి కనిపించకుండా అధికారులు ఓ గుడ్డను సైతం కప్పి ఉంచారు. ఇప్పటికైనా చెత్తకుప్పను తలపిస్తున్న రికార్డులను భద్రపర్చాలని పలువురు కోరుతున్నారు.

- ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి)

డంపింగ్ యార్డు కాదు..

రికార్డుల గుట్ట



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వైసీపీ నాయకులు

ఇసుక ఉచితంగా ఇవ్వండి

● కలెక్టరేట్ ఎదుట వైసీపీ ధర్నా

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఉచిత ఇసుక అందించాలని కోరుతూ వైసీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ధర్నా చేశారు. ఉచితంగా ఇసుక అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చి మోసం చేశాడని ఆరోపించారు. ఈ కార్యక్రమానికి ముందు వీఆర్సీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అనంతరం కలెక్టరేట్‌కు ర్యాలీగా చేరుకున్నారు. ఇసుక ఉచితంగా అందించి భవన నిర్మాణ రంగాన్ని కాపాడాలని నినాదాలు చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీలు చంద్రశేఖర్, మేరిగ మురళీధర్, మాజీ ఎమ్మెల్యేలు కిలివేటి సంజీవయ్య, మేకపాటి విక్రమ్‌రెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి, ప్రతాప్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు. .

ఇంకుడు గుంతల తవ్వకానికి


శ్రీకారం

● ప్రతి నీటిబొట్టునూ ఒడిసిపడదాం

ఉదయగిరి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వర్షపు నీటిని ఒడిసిపట్టి భూమిలోకి ఇంకించాలి... పుడమి ఒడిలో భద్రంగా దాచిపెట్టి జల కష్టాలు తీర్చాలనే లక్ష్యంతో ప్రతి గ్రామంలో ఇంకుడు గుంతల తవ్వకానికి ఎన్డీయే ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

జిల్లాలో 23వేల ఇంకుడు గుంతల తవ్వకాలు

2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలోని 37 మండలాల్లో 23,000 ఇంకుడుగుంతల తవ్వకానికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారుల నుంచి ఇటీవల ఆదేశాలు అందాయి. ఒక్కో గుంత పొడవు, వెడల్పు, లోతు 1.20 మీటర్లు ఉండేలా తవ్వకాలు చేపట్టాలని నిర్ణయించింది. గుంతలో పెద్ద, చిన్న రాళ్లు, కంకర ఎంత మోతాదులో వేయాలో నిర్ణయించారు. ఇందుకోసం పనులు చేసిన కూలీ వేతనం రూ.550, సామాగ్రి కొనుగోలుకు రూ.5,450 ఖర్చు చేయాలని అనుమతిచ్చారు. ఈ లెక్కన జిల్లాలో రూ.13.80 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇప్పటికే ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఎంపీడీవో, ఏపీడీ, ఏపీవో, ఈసీ, క్షేత్ర, సాంకేతిక సహాయకులకు ప్రణాళికలు సిద్ధం చేసి వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు. వీధుల్లో నీరు ఎక్కువగా నిలిచే ప్రదేశాలను గుర్తించి ఇంకుడుగుంతలు తవ్వించాలన్నారు.



ఇంకుడుగుంత మ్యాప్

భూగర్భ జలాల పెంపే లక్ష్యం

భూగర్భజలాల పెంపే లక్ష్యంగా ప్రజల భాగస్వామ్యంతో జిల్లాలో ఇంకుడు గుంతల తవ్వకంపై ప్రత్యేక దృష్టిసారించాం. మెట్ట ప్రాంతాల్లో మండలానికి 1000 చొప్పున, డెల్టా ప్రాంతాల్లో అవసరమైన చోట మొత్తం 23 వేల ఇంకుడు గుంతల తవ్వకాలు చేపట్టనున్నాం. ఇప్పటికే కార్యాచరణ ప్రణాళిక రూపొందించి క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలిచ్చాం.

- గంగాభవాని, డ్వామా పీడీ

రేపు రెజ్లింగ్ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రెజ్లింగ్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పురుషులు, మహిళల జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు అజయ్‌కుమార్‌రెడ్డి, నాగేంద్రరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగే ఎంపికలకు ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన వారు అనంతపురం జిల్లా రాయదుర్గంలో నవంబరు 9, 10 తేదీల్లో జరిగే రాష్ట్ర పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9441644761 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఎస్ఎస్ఏలో

కేజీబీవీ పోస్టుల మెరిట్‌లిస్ట్

నెల్లూరు(విద్య), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)ల్లో బోధన, బోధనేతర సిబ్బంది పోస్టుల భర్తీకి సంబంధించి అభ్యర్థుల మెరిట్ జాబితాను సమగ్రశిక్ష కార్యాలయంలో అందు బాటులో ఉంచినట్లు ఎస్ఎస్ఏ ఏపీసీ సీహెచ్ ఉషారాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థులు ఈ మెరిట్ జాబితాను పరిశీలించి అభ్యంతరాలుంటే శనివారం సాయంత్రం 5 గంటలలోపు రాతపూర్వకంగా తెలియచేయాలని కోరారు.

డిగ్రీ పరీక్షలలో ఇద్దరు డీబార్



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న వీసీ డాక్టర్ విజయభాస్కర్‌రావు

వెంకటాచలం, అక్టోబరు 25 (ఆంధ్ర జ్యోతి): విక్రమ సింహ పురి యూనివర్సిటీలోని అనుబంధ డిగ్రీ కళాశా లలో శుక్రవారం మధ్యా హ్నం జరిగిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ పరీక్షలలో నెల్లూరులోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారిని డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు 220 మంది గైర్హాజరయ్యారన్నారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

జిల్లావ్యాప్తంగా ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ సెమిస్టర్ పరీక్షా కేంద్రాలను శుక్రవారం వీఎస్‌యూ వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సంగంలోని నేతాజీ డిగ్రీ కళాశాలతోపాటు మరికొన్ని పరీక్షా కేంద్రాలను పరిశీలించి విద్యార్థుల హాజరు, పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షించారు.

వీఎస్‌యూ ప్రతిష్టను నిలబెట్టాలి: వలంటీర్‌కు వీసీ అభినందనలు

భారత ప్రభుత్వం ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రీ రిపబ్లిక్‌డే క్యాంపునకు విక్రమ సింహపురి యూనివర్సిటీ కళాశాలలో ఆర్గానిక్ కెమిస్ట్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సీహెచ్ ప్రసాద్ ఎంపికయ్యారు. యూనివర్సిటీలోని ఎన్ఎస్ఎస్ యూనిట్-4లో వలంటీర్‌గా ఉన్న ప్రసాద్ పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. మహారాష్ట్రలోని జలగావ్‌లో జరిగే ప్రీ రిపబ్లిక్ డే క్యాంపునకు ఎంపికయ్యారు. దీంతో శుక్రవారం ప్రసాద్‌ను వీఎస్‌యూ వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు ప్రత్యేకంగా అభినందించారు. వీసీ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో వీఎస్‌యూ ప్రతిష్టను నిలబెట్టాలని కోరారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, ఎన్ఎస్ఎస్ యూనిట్-4 ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బీ వెంకట సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల తర్వాత తెరుచుకున్న తలుపులు

● పోలీసుల సమక్షంలో పంచాయతీ కార్యాలయానికి తాళం తీసిన అధికారులు



పంచాయతీ కార్యాలయం వద్ద అధికారులు

పొదలకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నెల రోజులుగా వివాదాస్పదంగా మారిన పొదలకూరు పంచాయతీ కార్యాలయ తలుపులను పోలీసుల సమక్షంలో శుక్రవారం అధికారులు తెరిచారు. వివిధ రకాల పింఛన్లకు సంబంధించిన రిజిస్టర్లు, చెక్‌బుక్‌లను ఎంపీడీవో, ఈఓపీఆర్‌డీ, పూర్వపు పంచాయతీ కార్యదర్శి దొరబాబు సమక్షంలో ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి తీసుకున్నారు. ఆ తర్వాత తాళాలు వేసి వీఆర్వో ద్వారా తహసీల్దారుకు చేర్చారు. నెల రోజులుగా పంచాయతీ కార్యాలయ వివాదంతో ఉండటంతో వైసీపీ, టీడీపీ వర్గాలు చెరోతాళం వేసి ఆ తాళాలను తహసీల్దారు వద్ద ఉంచారు. అయితే గతంలో బిట్-1 సచివాలయంలో పంచాయతీ కార్యాలయం నిర్వహిస్తూ ఉండేవారు. ఇటీవల దానిని ప్రధాన వాటర్ ట్యాంకు పక్కన ఉన్న కమ్యూనిటీ భవనంలోకి మార్చారు. టీడీపీ వర్గీయులు అన్న క్యాంటీన్ కోసం ఆ భవనాన్ని ఉపయోగించుకోవాలని నిర్ణయానికి వచ్చిన సమయంలో పంచాయతీ పాలక వర్గం (వైసీపీ) ఉన్నపళంగా నిబంధనలకు విరుద్ధంగా పంచాయతీ రికార్డులను, కార్యాలయ వస్తువులను మార్చడంతో వివాదం తలెత్తింది. దీంతో ఇరువర్గాల వారు తాళాలు వేయడంతో పారిశుద్ధ్యం నిర్వహనకు ఆటంకాలు వచ్చాయి. ఈ క్రమంలోనే పింఛన్ల పంపిణీ తేదీ సమీపిస్తుండటంతో శుక్రవారం పోలీసుల సమక్షంలో పంచాయతీ కార్యాలయ తలుపులు తెరిచారు.

పోలీసు కస్టడీలో

హత్య కేసు నిందితుడు?

నెల్లూరు(క్రైం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆటో మెకానిక్ ముక్తియార్ హత్య కేసులో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. నెల్లూరు రూరల్ మండలం ఇందిరమ్మ కాలనీకి చెందిన ముక్తియార్ అయ్యప్పగుడి సమీపంలోని పఠాన్‌బాబు మెకానిక్ షెడ్డులో పనిచేస్తున్నాడు. ఆయన గురువారం షాపు యజమాని బాబు చేతిలో హత్యకు గురయ్యాడు. పరారీలో ఉన్న నిందితుడు బాబును శుక్రవారం వేదాయపాళెం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ముక్తియార్ తాకట్టులో ఉన్న తన ఆటోను విడిపించుకునేందుకు రూ.30 వేలు నగదు కావాలంటూ యజమాని బాబును వేధిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే గురువారం షెడ్డు వద్దకు వెళ్లాడు. ఈ సందర్భంగా జరిగిన గొడవలో మృతి చెందినట్లు తెలిసింది.

బాలల సంరక్షణకు సమన్వయంతో పని చేయాలి

● బాలల హక్కులపై టాస్క్‌ఫోర్స్ కమిటీ

● రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి



సమావేశంలో మాట్లాడుతున్న పద్మావతి

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బాలల సంరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి ఆదేశించారు. బాలల సంరక్షణకు చేపడుతున్న వివిధ కార్యక్రమాల పురోగతిపై శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారులతో ఆమె సమీక్ష జరిపారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల అపహరణ, బాలికల అత్యాచారాలు వంటి అమానవీయ ఘటనలు జరుగకుండా అన్ని వ్యవస్థలు సమర్థంగా, బాధ్యతాయుతంగా పని చేయాలని కోరారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, జిల్లాలో 60 మంది బాలికలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించినట్లు తెలిపారు. మాదక ద్రవ్యాలు, మద్యపానం దుష్ఫలితాలపై పాఠశాలల్లో ప్రహరీక్లబ్‌లు ఏర్పాటు చేసి విద్యా ర్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. బాలసదన్, శిశుగృహాల్లో ఉంటున్న అనాథ చిన్నారులను వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చే ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రుల ఆచూకీ లభ్యం కానిపక్షంలో దత్తత ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. బాలల హక్కులకు భంగం కలిగించే అంశాలపై కమిషన్ ప్రత్యేక దృష్టి పెట్టి, టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసిందని వెల్లడించారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, కార్మిక శాఖ జిల్లా ఉప కమిషనర్ వెంకటేశ్వరరావు, జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్, బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మాధవి, సమత తదితరులు పాల్గొన్నారు.

● **హాస్టల్ విద్యార్థుల సంక్షేమంపై దృష్టి పెట్టండి**

నెల్లూరు (హరనాథపురం) : ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బీ పద్మావతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో సంక్షేమశాఖ అధికారులతో సమావేశం జరిగింది. సంక్షేమ వసతి గృహాల్లోని పిల్లలు అనేక రకాలుగా హింసకు, మానసిక వేధింపులకు గురవుతున్నారని చెప్పారు. ఆ పిల్లలకు పాఠ్యాంశాలతోపాటు చట్టాలపై కూడా అవగాహన కల్పించాలన్నారు. వసతి గృహాల్లో ఫిర్యాదు బాక్సులను ఏర్పాటు చేయించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమాధికారి శ్రీనివాసులు, గిరిజన సంక్షేమా ధికారి పరిమళ, బీసీ సంక్షేమాధికారి కొల్లి ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పోలేరమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

సంగం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగల్లు గిరిజన కాలనీలో పోలేరమ్మ, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

● కలిగిరి : స్థానిక కొత్తూరు ప్రాంతంలోని కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం హనుమత్ సమేత సీతారామ,లక్ష్మణ విగ్రహాల ప్రతిష్ఠాపన చేపట్టారు.స్వామివారి ప్రథమ దర్శనానికి ఎమ్మెల్యే కాకర్ల సురేశ్‌తోపాటు మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి హాజరైనారు. నిర్వాహకులు ఆలయ ప్రాంగణం వద్ద భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



కలువాయి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుల్లూరులో శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం, నళినమ్మ దంపతులు, ఆల్ ఇండియా వడ్డెర కమ్యూనిటీ ప్రధాన కార్యదర్శి హెచ్ జయశంకర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

మండలంలోని బ్రాహ్మణపల్లిలో శుక్రవారం సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గోనుగుంట వెంకటేశ్వర్లు నాయుడు, నాయకులు గడ్డం కిషోర్‌రెడ్డి, చల్లా రఘురామిరెడ్డి, బట్రెడ్డి శ్రీనివాసులరెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా విత్తనాలు అమ్మితే చర్యలు

అల్లూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల రైతులకు విత్తనాలను అందుబాటులో ఉంచుతామని కావలి ఏడీఏ నాగరాజు తెలిపారు. శుక్రవారం అల్లూరు వ్యవసాయశాఖ కార్యాలయంలో వీఏఏలతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. అవసరమైన వారు రైతు కేంద్రాలను సంప్రదించాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తుల వద్ద విత్తనాలు కొనుగోలు చేయవద్దని అనుమతులు ఉన్న కేంద్రాల్లోనే విత్తనాలు తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతులు పొందిన వారే అన్ని రకాల పత్రాల ఆధారంగా లేబుల్స్‌తో విక్రయించాలే తప్ప కేవలం సంచుల్లో వేసి సీల్ చేసి విక్రయించరాదన్నారు. రైతుల నుండి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశువైద్య కేంద్రాలు

● వరండాల్లోనే ఉద్యోగుల విధులు
● మందులు ఉంచేందుకు గదులు కరువు



శిథిలావస్థకు చేరి కూలే దశలో ఉన్న ఉదయగిరి పశువైద్య కేంద్రం



మందులతో నిండిన గదులు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో వ్యవసాయం కంటే పాడి మీద ఆధారపడి అధికశాతం మంది జీవిస్తున్నారు. అయితే ఈప్రాంతంలో శిథిలావస్థకు చేరిన పశువైద్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఉదయగిరి ఏడీ పరిధిలో సుమారు 16,800 గేదెలు, ఆవులు, 65 గొర్రెలు, మేకలు ఉన్నాయి. ఉదయగిరి పట్టణంలో 1963లో నిర్మించిన భవనంలో పశు వైద్యశాల కొనసాగుతోంది. ఈ భవనంలో మందులకే గదులు సరిపోగా సిబ్బంది వరండాలో కూర్చొని విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. ఆవరణలో కంపచెట్లు మొలచి విషపురుగులకు నిలయంగా మారింది. కేంద్రాల్లో మౌలిక వసతులు లేకపోవడతో మూగజీవాలకు వైద్యసేవలు సక్రమంగా అందడంలేదు. గండిపాళెంలోనూ అదే పరిస్థితి. అలాగే ఉదయగిరి, సీతారామపురం మండలాల్లో వైద్యుల కొరత సైతం ఉంది. గత వైసీపీ ప్రభుత్వం పశువైద్య కేంద్రాల బాగోగులను పట్టించుకోలేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా నూతన భవనాలు మంజూరు చేసి మూగజీవాలకు మెరుగైన వైద్యసేవలందేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా: ఏడీ

భవనాల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రధానంగా ఉదయగిరి పశు వైద్యశాల భవనం పూర్తి శిథిలావస్థకు చేరింది. నూతన భవన నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

టీడీపీ సభ్యత్వ నమోదు విజయవంతం చేయండి

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26నుంచి ప్రారంభమవుతున్న తెలుగుదేశం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలంతా సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం వారికి సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పించారు. పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదు కార్యక్రమం ఎంతో కీలకమని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో ముందుచూపుతో కార్యకర్తల కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమం తీసుకవచ్చారని తెలిపారు. సభ్యత్వం తీసుకున్న కార్యకర్త ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే 5 లక్షల రూపాయలు, సహజ మరణమైతే పదివేల రూపాయలు ఆ కుటుంబానికి ఆర్థికసహాయం అందిస్తామన్నారు. సభ్యత్వ నమోదులో కందుకూరును నెల్లూరు పార్లమెంటు పరిధిలో మొదటి స్థానంలో నిలిచేలా కృషి చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వర రావు, జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహ్మం, పిడికిటి వెంక టేశ్వర్లు, కంద్రా మాల్యాద్రి, షేక్ రఫీ, మధుబాబు పాల్గొన్నారు.

మాలకొండలో అభివృద్ధి పనులపై సమీక్ష

● వలేటివారిపాలెం : మాలకొండ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం అభివృద్ధి పనులపై శుక్రవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆలయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మాలకొండపైకి వెళ్లే ఘాట్‌రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చుట, అమ్మవారు ఆలయానికి వెళ్లే మెట్ల మార్గంను మెట్ల పునర్నిర్మాణం, ప్రముఖులకు నూతన గదుల నిర్మాణం, వాహన పార్కింగ్, కొండ కింద చిరు వ్యాపారులకు షాపింగ్ కాం ప్లెక్స్ తదితర సదుపాయాలపై ప్రతిపాదనలు తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అన్న ప్రసాదంలో నాణ్యత లోపిస్తే సహించేది లేదన్నారు. భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. కార్య క్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ సాగర్‌బాబు, ఎస్ఐ మరిదినాయుడు, మాదాల లక్ష్మీ నరసింహం పాల్గొన్నారు.

దోచుకుంటే సహించేది లేదు

కావలి టౌన్ (ఆంధ్రజ్యోతి): దోచుకుంటే సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి తెలిపారు. వైసీపీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన కలెక్టరేట్ ముట్టడికి ఆయన తన నివాసం వద్ద నుంచి పార్టీ శ్రేణులతో తరలివెళ్లారు. పార్టీ కార్యకర్తలను ఇబ్బందిపెడితే ఊరుకోమన్నారు.

పశుగణనకు సహకరించండి : ఎమ్మెల్యే దగుమాటి



పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి

కావలి, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి) పశుగణన సేకరణకు వచ్చే వారికి పశువుల సమగ్ర సమాచారం అందించాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. పశుగణనకు సంబంధించిన 21వ అఖిలభారత పశుగణన పోస్టర్‌ను శుక్రవారం సాయంత్రం కావలి ఎమ్మెల్యే కార్యాలయంలో పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ నెల 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు పశుగణన జరుగుతోందన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, ఏడీ డాక్టర్ రసూల్, డాక్టర్ లక్ష్మీశైలజ, డాక్టర్ కాముశ్వరరావు, సిబ్బంది. టీడీపీ నేతలు ఆవుల రామకృష్ణ, బొట్లగుంట హరిబాబు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం

విజయవాడ వరద బాధితులకు ప్రయివేట్ స్కూల్స్ యాజమాన్యం రూ.2లక్షల విరాళంను డీడీ రూపంలో శుక్రవారం రాత్రి కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డికి అందజేశారు. కావలి ఎమ్మెల్యే కార్యా లయంలో జరిగిన ప్రయివేట్ స్కూల్స్ యజమానులను అభినందించారు.

ఆపరేషన్‌కు ఆర్థికసాయం

మోకాళ్ల ఆపరేషన్ నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి ముందస్తు ఆర్థిక సహాయం కింద రూ.2,17,200ల చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే దగుమాటి వెకావలిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కావలి మున్సిపాలిటీ పరిధిలోని చౌదరిపాలెం వృద్ధురాలు గొంది రామలక్ష్మమ్మ గత రెండేళ్లుగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతూ శస్త్రచికిత్స చేయించుకునే ఆర్థికస్థోమత లేక ఇబ్బందులు పడుతోంది. ఈ విషయాన్ని బాధిత కుటుంబసభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. ఈ సందర్భంగా వారు సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

అమరవీరుల స్మృతి సంఘీభావ ర్యాలీ

కందుకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల స్మృతి వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని సబ్ డివిజన్ పోలీసులు అమరవీరుల సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. కందుకూరు డీఎస్పీ వి.బాల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీ సు సిబ్బంది పాల్గొన్నారు. పట్టణ పోలీసుస్టేషన్ నుంచి ఎన్టీఆర్ విగ్రహం సెంటర్ వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

లియాఫీ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



ప్రమాణం చేస్తున్న నూతనంగా ఎన్నికైన లియాఫీ కార్యవర్గ సభ్యులు

ఆత్మకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆత్మకూరు బ్రాంచి కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ఎల్ఐసీ ఏజెంట్స్ యూనియన్ (లియాఫీ) సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు బ్రాంచి లియాఫీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. గౌరవాధ్యక్షుడిగా షేక్ ఖాజావలీ, అధ్యక్షుడిగా పడసాల శ్రీనివాసులు, జనరల్ సెక్రటరీగా మెంతం శ్రీనివాసులరెడ్డి, ట్రెజరర్‌గా కోడూరు ఓబుల్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా కంచర్ల శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీలుగా చెరుకూరు చిన్నమస్తానయ్య, ఎన్ శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కంచర్ల శ్రీధర్‌నాయుడు ఎన్నికయ్యారు. వీరిని ఎల్ఐసీ ఏజెంట్లు సన్మానించి అభినందించారు. అనంతరం నూతన కర్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ డివిజన్ ఆఫీసుకు చెందిన లియాఫీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, వీరాస్వామి, షణ్ముగం, లియాఫీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వాడివేడిగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంఈవో-2 ఆనందరావు

కొండాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎంపీపీ బొడ్డు అనూరాధ అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ముందుగా మూడునెలల్లో వైద్యం, విద్య, పంచాయతీరాజ్, పారిశుధ్యం, వెటర్నరీ తదితర శాఖలతో మండలంలో జరిగిన అభివృద్ధి పను లపై ఎంపీడీవో ఆదినారాయణ సమీక్ష నిర్వహించారు. ఇటీవల పంచాయతీలలో సర్పంచులతో సంబంధం లేకుండా గ్రామసభలు నిర్వహించి సీసీ రోడ్ల పనులకు తీర్మాణాలు చేయడంపై వైసీపీ మద్దతుదారు సర్పంచులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారం రాష్ట్ర మంతా జరిగిందని అధికారులు చెప్పినా వారు వినిపించుకోక పోవడంతో గుడవళ్లూరు సర్పంచ్ మాచెర్ల కలుగజేసుకున్నారు. గత ప్రభుత్వంలో తన పంచాయతీలో రూ.40లక్షల పనులు తనకు సంబంధం లేకుండా చేసుకున్నప్పుడు మీరు ఎందుకు ప్రశ్నించలేదని వారిని నిలదీశారు. ఇలా సమస్యలపై సభలో గందరగోళం నెలకొనడంతో అధికారులు ఇరువురికి సర్దిచెప్పి సభను కొనసాగించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ఆనందరావు, ఇన్‌చార్జి పీఆర్ ఏఈ వాణి, ఇరిగేషన్ ఏఈ రమేష్‌కుమార్, పలు శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు భూముల అప్పగింత

ఉలవపాడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): 15 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వక్ఫ్‌బోర్డు భూములను రెవెన్యూ అధికారులు శుక్రవారం జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే ఖుదావన్‌కు అప్పగించారు. రాజుపాలెంలోని 39.64 ఎకరాలను స్థానికంగా 22 మంది రైతులు సాగు చేసుకుంటున్నారు. దీనిపై గత కొన్నేళ్లుగా రైతులు, వక్ఫ్‌బోర్డు మధ్య వివాదం జరిగింది. చివరకు ఆ భూముల వక్ఫ్‌బోర్డుకు చెందినవిగా రెవెన్యూ అధికారులు నిర్ధారించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కలిగిరి (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ మెట్టుకూరు శిరీష అధ్యక్షతన మండలసర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రత్యూష తెలిపారు.

రూ. 10.29 కోట్లతో అభివృద్ధి పనులు

● ఏడుకొండలు, ఆత్మకూరు పంచాయతీ రాజ్ డీఈ,



ఆత్మకూరు, అక్టోబరు 25 : (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఇటీవల విడుదలైన నిధులతో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని పంచాయతీరాజ్‌శాఖ డీఈ జి ఏడుకొండలు తెలిపారు.

? నియోజకవర్గానికి ఎన్ని కోట్ల నిధులు మంజూరయ్యాయి

! 6 మండలాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 10. 29 కోట్లు నిధులు కేటాయించారు.

? ఏయే మండలాలకు ఎన్నినిధులు కేటాయించారు

! ఆత్మకూరు మండలానికి రూ. 1.76 కోట్లు, ఏఎస్ పేటకు రూ. 1.74 కోట్లు, అనంతసాగరానికి రూ. 1.63 కోట్లు, మర్రిపాడుకు రూ. 1.86 కోట్లు, సంగంకు రూ. 1.54 కోట్లు, చేజర్ల మండలానికి రూ. 1.75 కోట్లు నిధులు కేటాయించారు.

? ఈ నిధులతో ఎన్ని సీసీ రోడ్లనిర్మాణం చేపట్టనున్నారు

! నియోజకర్గం మొత్తం మీద 198 సీసీ రోడ్ల నిర్మాణం చేపడతాం. అందులో ఆత్మకూరు మండలంలో 38, ఏఎస్‌పేటలో 31, అనంతసాగరంలో 36, మర్రిపాడులో 34, చేజర్లలో 29, సంగంలో 30 సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి.

న్యూస్ బాక్స్

అరుణాచలంకు ప్రత్యేక బస్సు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 4వ తేదీ కార్తీక సోమవారం సందర్భంగా ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి 3వ తేదీ ఉదయం 8 గంటలకు అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయగిరి, దుత్తలూరు, వింజమూరు, ఆత్మకూరు మీదుగా సిరిపురం గోల్డెన్ టెంపుల్‌ను ప్రయాణికులకు చూపించి అరుణాచలం బయలుదేరుతుందన్నారు. రానుపోను ఒక్కో ప్రయాణికుడికి రూ.1650 చార్జీ ఉంటుందన్నారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఉందని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

ఉదయగిరి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి సూచించారు. శుక్రవారం మండలంలోని వెంగళరావునగర్ జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజనం రుచి చూశారు. విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నూర్జహాన్, షకీలా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటినుంచి టీడీపీ సభ్యత్వ నమోదు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో 26వ తేదీన జీ.చెరువుపల్లి, 27న జీ.చెర్లోపల్లి, 28న జీ అయ్యవారిపల్లి, 29న బండగానిపల్లి, 30న పుల్లాయపల్లి, 31న శకునాలపల్లి, నవంబరు 1న నేలటూరు పంచాయతీల్లో సభ్యత్వ నమోదు జరుగుతుందన్నారు

ఉదయగిరిలో జాబ్‌మేళా

ఉదయగిరి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజ మోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీస్ మరియు సీడాప్‌లు సంయుక్తంగా జాబ్‌మేళా నిర్వహించాయి. ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు, డక్కన్‌వీల్స్ కంపెనీలు నిర్వహించిన ఈ జాబ్‌మేళాలో 23 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆకుల నరసింహులు, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి అఫ్జల్‌ఖయ్యూం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై వినతులు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మందళ్లపల్లి గ్రామంలో రీసర్వేలో వచ్చిన భూ సమస్యలపై తహసీల్దారు వై నాగరాజు సిబ్బందితో కలిసి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు రీసర్వేలో నెలకొన్న తప్పిదాలపై అధికారులకు వినతులు అందజేశారు. వినతులను పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దారు రైతులకు హామీ ఇచ్చారు.

మల్లవరప్పాడులో..

కొండాపురం: మల్లవరప్పాడులో జరిగిన రీసర్వేపై గ్రామసభకు 3వినతులు వచ్చినట్లు తహసీల్దార్ కోటేశ్వరరావు తెలిపారు. ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు, వీఆర్‌వో పోలయ్య, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

మెప్మా బజారు ప్రారంభం

కందుకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెప్మా సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం అర్బన్ బజార్‌ను నిర్వహించారు. మెప్మా పీడీ డాక్టరు డి. రవీంద్ర ఈ మార్కెట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ టీఈ కాంతయ్య, సీఓలు సూరత్న, మాధవీలత, డీఆర్‌పీ మహీధర, సంపత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ

రూరల్, కోవూరు, సర్వేపల్లి

న్యూస్ బాక్స్

చెరువు తూము గేట్ల పరిశీలన

విడవలూరు, అక్టోబరు 25,(ఆంధ్రజ్యోతి): చౌకిచర్ల చెరువు తూము గేట్లను శుక్రవారం ఇరిగేషన్ ఏఈ సురేష్, టీడీపీ మండల ఇన్‌చార్జి అడపాల శ్రీధర్‌రెడ్డిలు పార్టీ నాయకులు ఓగు నాగేశ్వరరావు, సమాధి శ్రీనివాసులు, కొల్లు చిన్న వెంకయ్యతో కలిసి పరిశీలించారు. చెరువు గేట్లు మరమ్మతులు చేయలేదని రైతులు ఇచ్చిన సమాచారం మేరకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సకాలంలో స్పందించారు. ఈ మేరకు ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో చర్చించి తూము గేట్లను వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో పరిశీలనకు వచ్చినట్లు ఏఈ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మరమ్మతులకు గురైన తూములను బాగుచేసి వెంటనేసాగునీటి విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

కాలువ పూడికతీత పనులు

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో దండిగుంట-వరిణి ఒకటో నెంబరు తూము కాలువ పూడికతీత పనులు ప్రారంభినట్లు గ్రామ రైతులు ఆవుల వాసు, కుడుముల మల్లికార్జున, చిన్నిబాబు తెలిపారు. ఈ విషయంపై శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. దండిగుంట-వరిణి కాలువ కింద వందలాది ఎకరాలు సాగులో ఉన్నాయని తెలిపారు. కొన్నేళ్లుగా పూడికతీతకు నోచుకోకపోవటంతో పంటలకు సకాలంలో సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడ్డారని చెప్పారు. ఈ విషయాన్ని పార్టీ మండల ఇన్‌చార్జి అడపాల శ్రీధర్‌రెడ్డి ద్వారా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి వీపీఆర్ ఫౌండేషన్ నిధులతో పనులు చేపట్టారని తెలిపారు.

'ఆక్రమిత స్థలాలు ఖాళీ చేయాల్సిందే'

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ పరిధిలోని శాంతినగర్, గాంధీనగర్, మంగలికట్టలోని ఆక్రమిత స్థలాల్లో వున్న పందుల పెంపకందారులు సోమవారానికి స్థలాలు ఖాళీచేసి రామచంద్రాపురంలో తాత్కాలికంగా కేటాయించిన ఇందిరమ్మ కాలనీలో నివాసాలు ఏర్పాటు చేసుకోవాలని శుక్రవారం సీఐ, కమిషనర్ హెచ్చరించారు. ఈమేరకు వారితో సామరస్యంగా చర్చించారు. ఖాళీ చేయకుంటే పోలీసు బలగాలతో బలవంతంగా ఖాళీ చేయించాల్సి వుంటుందని హెచ్చరించారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయండి

వెంకటాచలం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేయాలని ఆపార్టీ మండలాధ్యక్షుడు నక్కా శివకుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని కసుమూరులో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 7వ తేదీన విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డితో నాయకులు, కార్యకర్తల సమావేశం జరగనున్నదన్నారు. గ్రామాల్లో సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

పశుగణనకు సహకరించాలి

మనుబోలు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జాతీయ పశుగణనకు రైతులు సహకరించాలని స్థానిక పశువైద్యశాఖ ఏడీ గురవారెడ్డి కోరారు. మనుబోలులోని టీడీపీ నాయకుడు పచ్చిపాల రామిరెడ్డి నివాసంలో ఆయన రైతులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పశుగణన వివరాలను రైతులను అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు కార్తీక్‌రెడ్డి, పశుగణాధికారిణి ఎన్. గౌతమి, సహాయకులు హమీద్ తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరులో..

మండలంలో పశు గణన శుక్రవారం ప్రారంభమైందని ఏరియా పశు వైద్యశాల ఏడీ డాక్టర్ కె.అరుణ తెలిపారు. తమ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పశువులు, కోళ్లు, గొర్రెలు, పందులు, పెరటి కోళ్లు, మేకలు, పెంపుడు జంతువుల వివరాలు సేకరిస్తారన్నారు.

శ్మశానంలో వసతులు కల్పించాలి

మనుబోలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో శ్మశానంలో వసతులు కల్పించాలని, కంపచెట్లు పెరిగిపోయి అధ్వానంగా ఉందని, బోరు లేదంటూ గోవిందరాజపురం గ్రామస్థులు సర్వేపల్లి జనసేన ఇన్‌చార్జి బొబ్బేపల్లి సురేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఎంపీడీవో జలజాక్షికి శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షుడు పెనుబాక ప్రసాద్, కంటెసుధాకర్, జాకీర్, కంటే శ్రీలక్ష్మి, బీజేపి నాయకులు ఇరగరాజు వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

క్వారీ పేలుళ్లు.. కూలిన ఇంటి స్లాబ్



రాపూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిగిలపాడు సమీపంలోని వీఎల్ఆర్ స్టోన్ క్రషర్ అక్రమ బోర్ బ్లాస్టింగ్‌ల కారణంగా తమ ఇల్లు పెచ్చులూడి పడ్డాయని, ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని బాధితులు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఈ బ్లాస్టింగ్ కారణంగా తమ ఇల్లు కోల్పోయి నిరాశ్రయులమయ్యామని, ఇంటి నిర్మాణానికి సాయం అందించాలని కోరారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసర వస్తువుల వితరణ

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : వసుజ్యోతి చారిటబుల్ ట్రస్ట్, పీహెచ్‌పీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం బుజబుజనెల్లూరు నాగమ్మకాలనీలోని స్వర్ణదీపం చారిటబుల్ ట్రస్ట్ వృద్ధుల ఆశ్రమానికి నిత్యావసర సరుకులు అందించారు. ముఖ్య అతిథిగా డ్యూటీస్ సేవా సంస్థ అధ్యక్షుడు నూనె వెంగయ్య హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వసుజ్యోతి ట్రస్ట్ సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ జే వసుంధర, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, పీహెచ్‌సీ జిల్లా అధ్యక్షకార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు కనీస సౌకర్యాలు కల్పించాలి

● ఏపీ జేఏసీ అమరావతి నేత విజయలక్ష్మి

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 25 : మహిళా ఉద్యోగులు పని చేసే చోట కనీస సౌకర్యాలు కల్పించాలని ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నూరు విజయలక్ష్మి కోరారు. శుక్రవారం కలెక్టరేట్ తిక్కన భవన్లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి ఆధ్వర్యంలో మహిళా విభాగం కార్యవర్గ సమావేశం జరిగింది. ఆమె మాట్లాడు తూ పనిచేసే చోట కనీస వసతులు లేక మహిళా ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ సమావేశానంతరం కలెక్టర్ ఆనంద్‌ను కలిసి మహిళా ఉద్యోగుల సమస్యలు తెలుపుకునేందుకు పని ప్రదేశాల్లో బాక్సులు ఏర్పాటు చేయించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు శివకుమారిరెడ్డి పాల్గొన్నారు.

రీసర్వేలో హద్దులు మార్చేశారని ఫిర్యాదు

మనుబోలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల చేసిన రీసర్వేలో తమ పొలానికి సంబంధించిన హద్దులు మార్చేశారంటూ సదరు రైతు అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో శుక్రవారం తహసీల్దార్ సుబ్బయ్య, సర్వేయర్ శ్రీనువాసులు బండేపల్లి రెవెన్యూలోని సర్వే నెం. 426 భూమిని పరిశీలించారు. చర్యలు తీసుకుంటామని తెలిపారు.



పెద్ద నందిపై ఆదిదంపతుల వైభోగం

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 25: జొన్నవాడ గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామికి శుక్రవారం ఆలయ పురోహితులు నిత్య కల్యాణంను వైభవంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, పల్లకీసేవ చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లు పెద్ద వెండి నందిసేవ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. జొన్నవాడ నరసింహారెడ్డి, లక్ష్మి దంపతులు ఈ మొక్కుబడి సేవ చేపట్టారు.

ఆలయ ముఖ మండపంలో ఫిర్యాదుల పెట్టె

జొన్నవాడ ఆలయంలో భక్తులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా, అవకతవకలకు పాల్పడినా నేరుగా ఫిర్యాదు చేయలేని భక్తులు ఇకనుంచి ఈ ఫిర్యాదుల పెట్టెలో వేస్తే సంబంధిత అధికారులు పరిశీలించి చర్యలు తీసుకుంటారని ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

ఎన్టీఆర్ పార్కు వారం రోజుల్లో అందుబాటులోకి..

● రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఎన్టీఆర్ పార్కును వారం రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని రూర ల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కార్పొరేషన్ అధికారు లతో కలిసి ఆ పార్కును పరిశీలించారు. పార్కును గత టీడీపీ ప్రభుత్వంలో మంత్రి నారాయణ, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మేయర్ అజీజ్ అభివృద్ధి చేశారని తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక పార్కులో కొంత మేర పనులు చేసినా ప్రజలకు ఉపయోగపడలేదన్నారు. ప్రస్తుతం నుడా, కార్పొరేషన్ అధికారు లను సమన్వయం చేసుకుంటూ పార్కులన్నీ టినీ త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో 19వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి నూకరాజు మదన్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



పార్కులో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పోలీసు సిబ్బంది సంక్షేమమే కర్తవ్యం : ఎస్పీ

నెల్లూరు(క్రైం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు సిబ్బంది సంక్షేమమే ప్రథమ కర్తవ్యంగా పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహిస్తున్నామని ఎస్పీ జీ కృష్ణకాంత్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహించారు. 15 మంది నుంచి అర్జీలు స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడారు. సమస్య పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. అంకిత భావంతో విధులు నిర్వహించాలని, అనధికారికంగా గైర్హాజరు కావద్దని సిబ్బందికి సూచించారు.

స్కానింగ్ కేంద్రాల్లో అధికారుల ఆకస్మిక తనిఖీ

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖ అధికారులు శుక్రవారం నగరంలోని పలు స్కానింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. శిరీష స్కానింగ్ సెంటర్, రత్నసాయి డయాగ్నోస్టిక్ సెంటర్‌ను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి(డీఐవో) డాక్టర్ ఉమామహేశ్వరి మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరమైన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ప్రతి గర్భిణి వివరాలు ఆన్‌లైన్ పోర్టర్‌లో ఉంచాలని, ప్రతి నెల 2వ తేదీన వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని డెమో విభాగంలో స్కానింగ్ వివరాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి కనకరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ అశోక్ పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు

పొదలకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పొదలకూరు పట్టణంలోని డీఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వరల్డ్ ఆర్టిస్ట్ డే సందర్భంగా శుక్రవారం నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విజేతలైన వారికి సాయంత్రం ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో బహుమతులను అందజేశారు. నెల్లూరుకు చెందిన అమీర్ ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపకుడు షేక్ అమీర్‌జాన్ ఈ పోటీలను నిర్వహించగా 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. షేక్ అమీర్‌జాన్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాలుర, బాలికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు కె సనత్‌కుమార్, సునంద, పూర్వ విద్యార్థులు సోమాభాస్కర్, ఆర్టిస్ట్ గురు, రవికుమార్, మనోహర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేను రద్దు చేయాలి : కాగితాలపూరు రైతులు

మనుబోలు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో చేసిన రీసర్వే అంతా తప్పులతడకే.. మా గ్రామం రీసర్వే రద్దు చేయాలంటూ కాగితాలపూరు టీడీపీ నాయకుడు వెడిచెర్ల వెంకటరమణారెడ్డి జిల్లా సర్వే అండ్ ల్యాండ్స్ అధికారి (డిఎస్ఎల్‌వో) నాగశేఖర్‌కు ఫిర్యాదుచేశారు. మండలంలోని కాగితాలపూరు సచివాలయంలో శుక్రవారం రీసర్వే సమస్యలపై రెవెన్యూ సదస్సు నిర్వహించారు. డీఎస్ఎల్‌వో హాజరుకాగా ఆయనకు పలువురు రైతులు సమస్యలు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బయ్య, డీటీ మంజుల పాల్గొన్నారు.



డీఎస్ఎల్‌వోకి ఫిర్యాదు చేస్తున్న కాగితాలపూరు రైతులు

జాతీయ స్కేటింగ్‌కు జస్మిత

నెల్లూరు(విద్య), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : బెంగళూరులో త్వరలో జరగనున్న జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు డాక్టర్ కిషోర్స్ రత్నం పాఠశాల 8వ తరగతి విద్యార్థిని ఎస్ జస్మిత ఎంపికైనట్లు విద్యాసంస్థ జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు తెలిపారు. నగరంలోని పాఠశాలలో శుక్రవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థిని కాకినాడలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రింక్-1లో కాంస్య పతకం, రింక్-2లో రజత పతకం దక్కించుకుని జాతీయ పోటీలకు ఎంపికైందని చెప్పారు. విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ కృష్ణకిషోర్, వాసంతి ప్రత్యేకంగా జస్మితను అభినందించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్ మణిమాల, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల కబ్జా కోరల్లో పంట కాలువలు

● మంత్రి నారాయణను విమర్శిస్తే ఊరుకోం

● టీడీపీ నేత ఉచ్చి

నెల్లూరు(సిటీ), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పంట కాలువలను ఆక్రమించి స్వాధీనం చేసుకున్నది వైసీపీ నాయకులేనని టీడీపీ నేత ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్ ఆరోపించారు. ఈ కాలువలన్నిటినీ సర్వే చేసి పూర్వ స్థితికి తీసుకురావాలని అధికారు లను కోరారు. శుక్రవారం ఈ మేరకు శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో నగర కమిషనర్ సూర్యతేజకు వినతి పత్రం అందించారు. నగరంలోని సర్వే నెం. 607లో ఉండాల్సిన పంట కాలువ పూర్తిగా ఆక్రమణకు గురైందని, దీని వల్ల 13,15,16 డివిజన్లలోని ప్రజలకు డ్రైనేజీ సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు. మంత్రి నారాయణ ఆక్రమణలకు తావులేకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారని, అయినా కొందరు వైసీపీ నాయకులు అర్హత మరిచి మంత్రిని విమర్శిస్తున్నారని దుయ్యబట్టారు. నారాయణను విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో నాయకులు కాయల తిరుపతి, శ్రీకాంత్, మోహన్, శీలం, మల్లి తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందచేస్తున్న టీడీపీ నాయకులు

మద్యం దుకాణం తొలగించాలి

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మైపాడు రోడ్డు శ్రీనివాసనగర్‌లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని ఎత్తివేయాలని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆ దుకాణం వద్ద ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న మహిళలకు శుక్రవారం మద్దతు తెలిపారు. నిత్యం విద్యార్థులు, మహిళలు రాకపోకలు సాగించే ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేయడం తగదన్నారు. ఆ దుకాణాన్ని తొలగించే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా, నగర కార్యదర్శులు షేక్ మస్తాన్‌బీ, పద్మ, శివకుమారి, చిరంజీవి, డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్ఎస్ గ్రాండ్ ఇన్' హోటల్లో నిల్వ పదార్థాలు

● ఫిర్యాదుతో కమిషనర్ తనిఖీ

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక జొన్నవాడ సెంటర్లో కొత్తగా ఏర్పాటు చేసిన "ఎస్ఎస్ గ్రాండ్ ఇన్" హోటల్‌లో శుక్రవా రం నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఫ్రిడ్జిలో నిల్వ చేసిన (బాసుమతి రైస్) అన్నం, చపాతీలు పలు రకాల కూరలు, గోబీ, ఫ్రైడ్‌రైస్ సంబం ధిత పదార్థాలను గుర్తించారు. వాటిని చెత్త తరలించే వాహనంలో పడేసి హోటల్ నిర్వాహకులను హెచ్చరించారు. వెయ్యి రూపాయలు జరిమానా విధించారు. రెండు రోజులుగా కస్టమర్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా ఎవరూ పట్టించుకోక పోవడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.



నిల్వ ఆహారాన్ని నిర్వీర్యం చేస్తున్న కమిషనర్, సిబ్బంది

కలుజు తూములు సరిచేయించండి

● ఏఈకి రైతుల విన్నపం

మనుబోలు, అక్టోబరు 25: పెద్దచెరువు కలుజుతూములు బాగుచేయించాలంటూ స్థానిక రైతులు శుక్రవారం నీటిపారుదల శాఖ ఏఈ కృష్ణకు విన్నవించారు. తూముల సమస్యను టీడీపీ నాయకులు పచ్చిపాల రామిరెడ్డి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశానుసారం ఏఈ దెబ్బతిన్న కలుజుతూములను, పొలాలకు నీరు పారే మరో తూమును పరిశీలించారు. ఎమ్మెల్యేకు సమస్యను వివరించి త్వరలోనే బాగుచేయించేలా చర్యలు తీసుకుంటామని ఏఈ రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చేరెడ్డి పట్టాభిరామిరెడ్డి, పచ్చిపాల శ్రీకాంత్ రెడ్డి, కలికి సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో అగ్రగామిగా నిలవాలి : సోమిరెడ్డి

తోటపల్లి గూడూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో తోటపల్లిగూడూరు మండలం అగ్రగామిగా నిలవాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేదాయపాలెంలోని ఆయన నివాసంలో మండలం క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, బూత్ కన్వీనర్‌లతో సమావేశం నిర్వహించారు. సభ్యత్వ నమోదులో దిశానిర్దేశం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి కూటమి ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను ప్రజలకు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కొణతం రఘుబాబు, ముత్యాల శ్రీనివాసులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన శాంతిభద్రతలు కల్పించాలి : నగర డీఎస్పీ

నెల్లూరు(క్రైం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో నేరాలను కట్టడి చేసి ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు కల్పించాలని నగర డీఎస్పీ శ్రీనివాస రెడ్డి ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. ఆయన కార్యాలయంలో శుక్రవారం రాత్రి నగర ఇన్‌స్పెక్టర్లతో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని, యాక్టివ్ రౌడీషీటర్లపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించా లని, నేర నియంత్రణకు రాత్రి గస్తీని ముమ్మరం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో నగర ఇన్‌స్పెక్టర్లు చిట్టెం కోటేశ్వరరావు, అన్వర్ బాషా, మద్ది శ్రీనివాసరావు, రోశయ్య, కిశోర్‌కుమార్, సాంబశివరావు పాల్గొన్నారు.

ఫ్యూజ్ బాక్స్‌కి కవరు వేయండి

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని చిన్నబజారు గిడ్డంగివీధి సత్రం పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న ఫ్యూజ్ బాక్స్‌కి కవరు లేనందున స్థానికులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని ఆ ప్రాంత వాసులు శుక్రవారం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ విషయాన్ని కోటమిట్ట సర్కిల్ ఏఈ దృష్టి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో షేక్ ఖాదర్‌బాషా, శ్రీహరిరావు, టీ మోహన్, రాజశేఖర్, హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో సమస్యలు పరిష్కరించండి : జనసేన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అల్లీపురం డంపింగ్ యార్డులో సమస్యలు పరిష్కరించాలని, ప్రజా ప్రతినిధులు, అధికారులు కార్మికులకు ప్రణాళికా బద్ధమైన సూచనలు ఇవ్వాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ కోరారు. శుక్రవారం చెత్త యార్డును జనసేన నాయకులు పరిశీలించారు. కిషోర్ మాట్లాడుతూ సేకరించిన చెత్తను యార్డు లోపలికి వెళ్లి వదలడం, అక్కడి నుంచి దొంతాలి యార్డ్‌కు తరలించే క్రమంలో వాహనాల టైర్లు ఇరుక్కుని కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాలతో వాహనాలు లోపలికి వెళ్లలేకపోతున్నాయని, రోడ్డుకు పక్కగా చెత్తపోస్తే ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ సమస్య పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని కోరారు.

సమతుల వ్యవసాయ పద్ధతులపై అవగాహన

కోవూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సమగ్ర సమతుల్యత వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత గ్రామ వ్యవసాయ సహాయకులదే అని జిల్లా వ్యవసాయ పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త శ్రీలక్ష్మీ అన్నారు. స్థానిక సబ్ డివిజన్ వ్యవసాయ కార్యాలయంలో వారికి నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడారు. రబీ సీజన్‌లో అనుకూలమైన ఆర్ఎన్ఆర్ 1508 వరి వంగడాలను నవంబరు 15తర్వాత వరి నార్లు పోసుకునేలా రైతులకు సూచించాలన్నారు. పురుగు మందుల వినియోగం తగ్గించాలని చెప్పారు. అనంతరం జిల్లా వనరుల కేంద్ర సహాయ సంచాలకులు లక్ష్మీమాధవి మాట్లాడారు. వరిలో నీటి యాజమాన్య ప్రాముఖ్యతను వివరించి తెగుళ్ల సోకినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. సహాయ సంచాలకులు సుజాత మాట్లాడుతూ అన్ని పంటలకు విత్తనశుద్ధి చెయ్యాలన్నారు. కార్యక్రమంలో ఏపీ సీఎన్ఎఫ్‌లు శ్రీకాంత్, ఏ.శాంతి, కవిత, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నెల్లూరు రూరల్ కార్యదర్శిగా జనార్దన్

నెల్లూరు రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలం సీపీఎం కార్యదర్శిగా కొత్తవెల్లంటి గ్రామానికి చెందిన పూడిపర్తి జనార్దన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం మండలంలోని దేవరపాళెంలో పార్టీ మండల 6వ మహాసభ నిర్వహించారు. 11 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేలా వ్యవహరిస్తోందని విమర్శించారు. అన్నీ గ్రామాల్లో కమిటీలను ఏర్పాటు చేసి పార్టీని పటిష్టం చేయాలని పిలుపునిచ్చారు. ఇటీవల మరణించిన నేత సీతారాం ఏచూరి, జిల్లా నేత జక్కా వెంకయ్య, వెల్లంటి నాయకుడు పాదర్తి మస్తానయ్యకు నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజగోపాల్, చంద్రమౌళి, మాదాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇండియన్ ఒలంపియాడ్‌కు 'నారాయణ' విద్యార్థులు

నెల్లూరు(విద్య), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే జాతీయ స్థాయి ఇండియన్ ఒలంపియాడ్ క్యాలిఫయిర్ ఇన్ మ్యాథమ్యాటిక్స్‌కు నారాయణ విద్యాసంస్థలకు చెందిన 9, 10 తరగతుల విద్యార్థులు ఐదుగురు రెండోదశకు ఎంపికైనట్లు విద్యాసంస్థల డైరెక్టర్ పొంగూరు రమాదేవి తెలిపారు. శుక్రవారం నగరంలోని నారాయణ విద్యాసంస్థలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ధనలక్ష్మీపురం బ్రాంచ్‌కు చెందిన వై వెంకట కౌశిక్‌రెడ్డి, బీ జితేష్‌రెడ్డి, కే మేఘన్ కార్తికేయ, గోమతి నారాయణ బ్రాంచ్‌కు చెందిన ఎస్ నిఖిల్, ఆర్ లక్ష్య రెండోదశకు అర్హత సాధించారని చెప్పారు. ముందు మరిన్ని విజయాలు సాధించాలంటూ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమం లో విద్యాసంస్థల జీఎం వీ విజయభాస్కర్‌రెడ్డి, కోర్ డీన్ జేకే రాయుడు, ఏజీఎంలు శ్రీనివాసరెడ్డి, కే రవివర్మ, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

తోటపల్లిగూడూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర పేర్కొన్నారు. మండలంలోని చిన్నచెరుకూరు గ్రామంలో శుక్రవారం రీసర్వేలో భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన రైతుల నుంచి అర్జీలను రెవెన్యూ అధికారులతో కలిసి స్వీకరించారు. అనంతరం బొమ్మి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేస్తామని, అభివృద్ధికి ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్, సర్వేయర్ డీటీ గణేష్, ఆర్ఐ ద్వారకానాథ్, సర్వేయర్ మహబూబ్‌బాషా, గ్రామ రెవెన్యూ అధికారి సురేష్, గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీరాం సతీష్

తక్కువ ఖర్చుతో మోకీలు మార్పిడి

● 'అపోలో' వైద్య నిపుణులు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : అపోలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో తక్కువ ఖర్చుతో మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు ఆసుపత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరాం సతీష్ వెల్లడించారు. ఆసుపత్రిలో శుక్రవారం ఆయన విలేకరుల వివరాలు వెల్లడించారు. ఇప్పటికే ఆసుపత్రిలో 300 రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు. ఇది 100 శాతం సురక్షితమైందన్నారు. ఆర్థోపెడిక్ సర్జన్లు డాక్టర్ వివేకానందరెడ్డి, డాక్టర్ శశిధ ర్‌రెడ్డి మాట్లాడుతూ రోబోటిక్ శస్త్రచికిత్సల్లో రక్తస్రావం, మచ్చలు ఉండవని చెప్పారు. నొప్పి కూడా చాలా తక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఆసుపత్రి యూనిట్ హెడ్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వసతులతో అంజనీ శ్రీకరం

● శ్రేయ సంస్థ ఎండీ బాబు అగస్టస్



నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : అంజనీ శ్రీకరం పేరుతో పెద్దచెరుకూరులోని సిరిగార్డెన్స్ పక్కన కొత్తగా ఆధునిక వసతులతో వెంచర్ ఏర్పాటు చేశామని శ్రేయ రియల్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ డాక్టర్ కే బాబు అగస్టస్ తెలిపారు. ఇందులో 700 ప్లాట్లు అందుబాటు ధరల్లో ఉన్నాయని, ఇది మెగా గేటెడ్ కమ్యూనిటీ అని చెప్పారు. జిల్లాలో ఇప్పటికే 10 వెంచర్లు వేసినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో త్రిబులార్ నేచర్ హిల్ కౌంట్ పేరుతో కొత్తగా వెంచర్ ఏర్పాటు చేశామన్నారు. ఇందులో ఉన్న 500 ప్లాట్లను నెల్లూరీయులకు సరసమైన ధరలకు అందచేస్తామని తెలిపారు.

తిరుమల శ్రీవారి ఆలయం అనగానే మన కళ్లముందు కనిపించేది బంగారు రంగులో మెరిసిపోయే ఆనంద నిలయం. ఈ ఆనంద నిలయ గోపురం.. ఇందులోని ప్రతిమలు.. ప్రత్యేకతలు అందరికీ ఆసక్తికరమే. అలాంటి 'ఆనంద నిలయం కథ' ఏంటనేది 10వ పేజీలో చూద్దాం.






ముక్కంటి సేవలో విదేశీ భక్తులు

శ్రీకాళహస్తీశ్వరుడిని శుక్రవారం పలువురు విదేశీ భక్తులు దర్శించుకున్నారు. రష్యాకు చెందిన ఏడుగురు, కజికిస్తాన్‌కు చెందిన ముగ్గురు, టర్కీ దేశవాసులు ఐదుగురు.. మొత్తం 15మంది ఆలయానికి వచ్చారు. రూ.500 రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



నేటి నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు

● రూ. వంద సభ్యత్వంతో బీమా వర్తింపు

తిరుపతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదుకు శనివారం నుంచి శ్రీకారం చుడుతోంది. ఇప్పటికే నియోజకవర్గ స్థాయిలో సభ్యత్వ నమోదుపై నాయకులకు శిక్షణ ఇచ్చిన సంగతి తెలిసిందే. గతంతో పోలిస్తే ఇటీవల ఎన్నికల్లో అద్భుత విజయంతో పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో శ్రేణులు ఉత్సాహంగా ఉన్నారు. దీంతో అంచనాలకు మించి సభ్యత్వ నమోదు విజయవంతమవుతుందని పార్టీ భావిస్తోంది. కూటమి అధికారంలో ఉన్నందున గుర్తింపు కోసం క్రియాశీలక కార్యకర్తలు, గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి నాయకులు పోటాపోటీగా సభ్యులను చేర్పించేందుకు కృషి చేసే అవకాశం కనిపిస్తోంది. ఇక, పదవులు ఆశిస్తున్న వాళ్లు చురుగ్గా పాల్గొనేందుకు ఆస్కారముంది. మరోవైపు జిల్లాలో తిరుపతి మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాల్లోనూ టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్నందున సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పోటాపోటీగా, బల నిరూపణగా పరిగణించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకునే రాష్ట్ర పార్టీ కూడా జిల్లా, నియోజకవర్గాల వారీగా గతానికి మించి లక్ష్యాలను నిర్దేశించింది. అధికారంలో ఉన్నందున కూటమి ప్రభుత్వం హామీలను ఒకటొకటిగా నెరవేరుస్తున్న వైనం, అలాగే కొత్తగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్న విధానం గురించి ప్రజల్లోకి తీసుకెళ్లి సభ్యులుగా చేర్పించాలని జిల్లా టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

జీవకోన గంగమ్మ ఆలయం వద్ద ప్రారంభం

తిరుపతి నియోజకవర్గానికి సంబంధించి జీవకోన రాజీవ్ గాంధీ కాలనీలోని గంగమ్మ గుడి వద్ద శనివారం ఉదయం 10.30 గంటలకు టీడీపీ సభ్యత్వ నమోదును ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ప్రారంభించనున్నారు. సాధారణ సభ్యత్వం కాకుండా రూ.100 చెల్లించి తీసుకునే క్రియాశీలక సభ్యత్వానికి పార్టీ అదనపు ప్రయోజనాలు కల్పిస్తోంది. ఈ సభ్యత్వం తీసుకున్న వారికి రూ. 5 లక్షలు ప్రమాద బీమా వర్తిస్తుంది. సాధారణ మరణం సంభవిస్తే వారికి పార్టీ రూ. 10 వేలు చొప్పున చెల్లిస్తుంది.



నకిలీ పత్రాలతో బ్యాంకుకు బురిడీ

● ఎస్‌బీఐ అనుబంధ ఎస్‌ఎంఈ బ్రాంచిలో రూ.2.8 కోట్ల రుణం
● ఆపై పరిశ్రమ ఏర్పాటు చేయని వైనం
● పోలీసులను ఆశ్రయించిన అధికారులు
● ఆలస్యంగా వెలుగులోకి..

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నకిలీ డాక్యుమెంట్లతో బ్యాంకు అధికారులనే బురిడీ కొట్టించారు. పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నట్లు రూ.2.8 కోట్లు తీసుకుని.. పత్తాలేకుండా పోయారు. బ్యాంకు అధికారుల ఫిర్యాదుతో తిరుపతి క్రైం పోలీసులు ఆరా తీస్తున్నారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. రేణిగుంట మండలం వెంకటాపురం వద్ద లక్ష్మీ నరసింహ ఇండస్ట్రీ పేరిట ఫ్లోర్ క్లీనింగ్ క్లాత్‌ల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు చిలకలూరిపేట, నరసారావుపేటకు చెందిన కొందరు ప్లాన్ చేశారు. దీనికి బ్లూ ప్రింట్లు, స్థలానికి సంబంధించి ఈసీ, మూల పత్రాలు తదితరాలను సిద్ధం చేసుకున్నారు. పరిశ్రమల శాఖ అనుమతుల కోసం దరఖాస్తు చేయగా.. ఇప్పటి వరకు ఎలాంటి అనుమతులు రాలేదు. ఇక, తిరుపతి బాలాజీ కాలనీలో స్టేట్ బ్యాంకుకు అనుబంధంగా ఎస్‌ఎంఈ బ్రాంచి ఉంది. ఇక్కడ చిన్న తరహా.. కుటీర పరిశ్రమలు, చేతివృత్తుల వారికి రుణాలు మంజూరు చేస్తారు. దీతో వీరు ఎస్‌ఎంఈ బ్రాంచ్‌ని సంప్రదించారు. రుణానికి అవసరమైన డాక్యుమెంట్లు, భూమి పత్రాలను సమర్పించారు. బ్యాంకు అధికారులు కూడా పరిశ్రమను ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలించారు. నిబంధనల మేరకు అన్నీ సక్రమంగా ఉన్నాయని రెండేళ్ల కిందట రూ.2.80 కోట్ల రుణం మంజూరు చేశారు.

అసలు విషయం వెలుగు చూసిందిలా..

రుణం తీసుకుని రెండేళ్లు కావస్తున్నా అక్కడ పరిశ్రమ స్థాపించలేదు. సకాలంలో రుణ కంతులనూ చెల్లించలేదు. దీనిపై బ్యాంకు అధికారులు ఆరా తీశారు. మరోవైపు బ్యాంకులో తాకట్టు పెట్టిన భూమి పత్రాలను పరిశీలించారు. వాళ్లు ఒకవేళ రుణం చెల్లించకుంటే తనఖా పెట్టిన భూమినైనా వేలం వేసుకోవడానికి అవకాశం ఉంటుందని భావించారు. ఆ మేరకు డాక్యుమెంట్లను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తీసుకెళ్లి పరిశీలించగా అవి నకిలీవని తేలింది. దీంతో వారు తిరుపతి క్రైం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ తతంగం జరిగి ఆరేడు నెలలయ్యాయి. ఇదే కేసులో మొదటి నిందితుడ్ని మాత్రం గత నెల 20న క్రైం పోలీసులు అరెస్టు చేసినట్లు చెబుతున్నారు. మరో ముగ్గురి వరకు పరారీలో ఉండొచ్చని అనుమానిస్తున్నారు. వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. అదేవిధంగా, అప్పట్లో రుణం మంజూరు చేసిన మేనేజర్, అధికారుల పాత్రపైనా పోలీసులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. అప్పటి మేనేజరు.. ప్రస్తుతం విజయవాడలో ఉన్నట్లు సమాచారం.



అమ్మో.. ఏనుగుల గుంపు

రోడ్డుకు ఒక వైపు 16 ఏనుగుల ఘీంకారాలు. మరో వైపు వీటిని చూసేందుకు గుమిగూడిన జనం. ఇంకోవైపు రోడ్డుకు రెండువైపులా బందోబస్తు చేపడుతూ ఏనుగులను అడవి వైపు మళ్లించేందుకు అటవీశాఖ అధికారులు, పోలీసులు. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరు సమీపంలోని గుట్టమీదపల్లి వద్ద శుక్రవారం ఉదయం దృశ్యమిది. రెండు గంటల పాటు ఉత్కంఠ నెలకొంది. చివరకు ఏనుగుల గుంపు అడవి వైపు అడుగులు వేయడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

- కల్లూరు

రుయాస్పత్రిలో ఫ్లెక్సీలు పెడితే చర్యలు

● అధికారులకు తేల్చిచెప్పిన కలెక్టరు
● హెచ్‌డీఎస్ సభ్యుడి తీరుపైనా ఆగ్రహం

తిరుపతి(వైద్యం), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): 'తిరుపతి రుయాస్పత్రి నో ఫ్లెక్సీ జోన్ అనేది అందరూ గుర్తుపెట్టుకోవాలి. ప్రభుత్వ పథకాల బోర్డులు తప్ప, ఇతర ఫ్లెక్సీలు, బోర్డులు పెడితే రుయా అధికారులపై చర్యలు తప్పవు' అని కలెక్టరు వెంకటేశ్వర్ హెచ్చరించినట్లు తెలిసింది. హెచ్‌డీఎస్ వర్కింగ్ ఛైర్మన్‌గా చెప్పుకొనే సభ్యుడు బండ్ల లక్ష్మీపతి తీరుపైనా ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. వివరాలిలా ఉన్నాయి. మరోసారి లక్ష్మీపతి హెచ్‌డీఎస్ వర్కింగ్ ఛైర్మన్ అని చెలామణి అయితే తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రుయాస్పత్రిలో అధికారికంగా నిర్వహించే ఈ కార్యక్రమంలోనూ అతడికి ప్రాధాన్యం ఇవ్వరాదని, శిలాఫలకాలపైనా పేరు ఉండరాదని అధికారులకు స్పష్టంచేసినట్లు తెలిసింది. ఆస్పత్రి అభివృద్ధి, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సహకరిస్తారనే కమిటీలో సభ్యులుగా తీసుకుంటామని, వారే ఇలా రోగులు, వైద్యులు ఇబ్బందులకు గురయ్యేలా వ్యవహరించడం బాధాకరమని పేర్కొన్నారు. ఇతడి చర్యల వల్ల పాలకులకు, ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉందనే విషయాన్ని ప్రతీ ఒక్కరూ గ్రహించాలన్నారు. ఇలాంటి అంశాలపై పాలకులు సైతం దృష్టి పెట్టి ఆస్పత్రి అభివృద్ధికి సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అధికారులతో చర్చించినట్లు తెలిసింది. మరోసారి ఇటువంటివి చోటుచేసుంటే తక్షణమే రుయా అధికారులు తన దృష్టికి తీసుకురావాలని లేకపోతే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రైతులే పంట బీమా కట్టుకోవాలి

తిరుపతి (ఎంఆర్‌పల్లె), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగుచేసే పంటలకు రైతులే బీమా కట్టుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు శుక్రవారం తెలిపారు. రుణాలు తీసుకున్న రైతులు బ్యాంకు ద్వారా, తీసుకోని వారు మీసేవా కేంద్రాల్లో వేరుశనగ పంట ఎకరాకు రూ.450, వరికి రూ.630 చొప్పున బీమా ప్రీమియం చెల్లించాలని సూచించారు. సీఎస్‌సీ సెంటర్, ఎన్‌సీఐపీ వెబ్‌సైట్‌లోనూ ప్రీమియం కట్టవచ్చని తెలిపారు.

స్విమ్స్‌లో బీఎస్సీ నర్సింగ్, పారా మెడికల్ కోర్సులకు కౌన్సెలింగ్

తిరుపతి(వైద్యం), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ యునివర్సిటీలో బీఎస్సీ(నర్సింగ్), బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ, బీఎస్సీ అలైడ్ హెల్త్ సైన్సెస్(పారా మెడికల్) కోర్సులకు 4వ విడత, ఫైనల్ ఆఫ్‌లైన్ విధానంతో ఈ నెల 29న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రారు అపర్ణ బిట్లా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు పూర్తి ఫీజుతో హాజరు కావాలని కోరారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే రిజర్వేషన్ క్యాటగిరీ ప్రకారం ఏపీఈఏపీసీఈటి ర్యాంక్ కట్ ఆఫ్‌ను అనుసరించి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం సీట్ల భర్తీ జరుగుతుందని, ఉదయం 8.30 గంటలకు శ్రీపద్మావతి మెడికల్ కళాశాలకు చేరుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు.



రంగు రంగుల విద్యుద్దీప కాంతులతో తిరుపతిలోని గోవింద రాజస్వామి ఆలయ రాజగోపురం శుక్రవారం రాత్రి మెరిసిపోయింది. దీపావళి వేడుకల్లో భాగంగా ఆలయంలో ఈనెల 30, 31 తేదీల్లో విశేష పూజలు, దీపావళి ఆస్థానం నిర్వహించనున్నారు.
ఈ నేపథ్యంలో విద్యుద్దీపాలతో ఆలయాన్ని, గోపురాలను టీటీడీ అలంకరించింది. ఠీవిగా నింగిలోకి చూస్తున్నట్లుగా ఉండే ఈ గోపురం.. రంగురంగుల కాంతులతో మెరిసిపోతూ నగరవాసులను, యాత్రికులను ఆకట్టుకుంటోంది.

- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

చల్లని గాలులు.. ప్రకృతి సోయగాల నడుమ పచ్చటి పొలాల్లో పక్షులు కిలకిలరావాలతో సందడి చేస్తున్నాయి. తీర ప్రాంత గ్రామమైన దామరాయి వద్ద వరిపైరుకు నష్టం కలిగించే కీటకాలను తింటూ.. చక్కర్లు కొడుతున్నాయి. ఈ సీజనైతే చాలు.. రైతన్నలకు నేస్తాలుగా ఈ పక్షులు పంట పొలాలపై ఎగురుతూ, అటు వెళ్లేవారికి కనువిందు చేస్తుంటాయి.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి




ఆనంద నిలయం కథ

ప్రత్యేక కథనం తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమల అనగానే వెలుగులీనే బంగారు గోపురం గుర్తొస్తుంది. దీనిని 'ఆనంద నిలయ విమానం' అంటారు. బంగారు తాపడపు కవచాలలో ఒదిగిన ఈ గోపురాన్ని ఎప్పుడు నిర్మించారనే ఆధారాల్లో స్పష్టత లేదు కానీ, బంగారు తాపడపు పనులు ఎప్పుడెప్పుడు జరిగాయో శాసన లిఖితమై ఉంది. 12, 13 శతాబ్దాల కాలంలో తిరుమల ఆలయ నిర్మాణ సమయంలో ఈ గోపురానికి 'విమానం' అనే మాట తొలిసారి వినిపించింది అంటారు. ఈ మూడంతస్తుల గోపురంలో దిగువన ఉండే రెండంతస్తులు దీర్ఘచతురస్రాకారంలో ఉంటాయి. చివరి అంతస్థు వర్తులాకారంగా ఉంటుంది. వేసర శైలిలో నిర్మించిన ఈ గోపురం మీద అసంఖ్యాక శిల్పాలుంటాయి. తొలి అంతస్తులో మాత్రం లతలు, మకరతోరణాలు మాత్రమే ఉంటాయి. రెండో అంతస్తులో వివిధ భంగిమల్లో 40 శిల్పాలుంటాయి. ఈ అంతస్తులోనే వాయవ్యంలో విమాన వేంకటేశ్వరుడి ప్రతిమ ఉంటుంది. మూడో అంతస్తులో మహాపద్మంతో పాటు 20 ప్రతిమలు ఉంటాయి. నాలుగు మూలల్లో 8 సింహాలుంటాయి. చిలకలు, లతలు, హంసలతో ఈ వర్తులాకారపు శిఖరగోపురం ఆకర్షణీయంగా ఉంటుంది.

భూతలం నుండి బంగారు కలశం దాకా ఆనందనిలయ విమానం ఎత్తు 65 అడుగుల 2 అంగుళాలు.





హైదరాబాదు మ్యూజియంలో ఉన్న తిరుమల ఆలయ సముదాయాల పాతచిత్రం

ఆనందనిలయం బొమ్మతో 2002లో తపాలాశాఖ ప్రత్యేక స్టాంపును కూడా విడుదల చేసింది.

- క్రీ.శ.839లో పల్లవరాజు విజయదంతి విక్రమవర్మ ఆనంద నిలయ విమానానికి స్వర్ణకవచం ఏర్పరచాడు.
- క్రీ.శ.1262లో జాతవర్మ సుందరపాండ్య దేవుడు కూడా స్వర్ణ కవచాన్ని సమర్పించాడు.
- క్రీ.శ.1359 జూలై 6న సాళువ మంగిదేవ మహారాజు ఆనంద నిలయ విమానంపై వున్న పాత కలశాన్ని తీసివేసి కొత్త బంగారు కలశాన్ని ప్రతిష్ఠించాడు.
- క్రీ.శ.1417లో విజయనగర అమాత్యుడు చంద్రగిరి మల్లన ఆనంద నిలయ విమాన జీర్ణోద్ధరణ చేశాడు.
- క్రీ.శ.1518 సెప్టెంబర్ 9న విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయలు 30 వేల బంగారు వరహాలతో ఆనంద నిలయ విమానానికి బంగారు మలాము చేయించాడు. ఆ తర్వాత వీరనరసింగదేవ యాదవరాయలు కూడా తన ఎత్తు బంగారాన్ని తులాభారం వేసుకుని, ఆ బంగారంతో ఆనందనిలయ విమానంతో పాటు బంగారు వాకిళ్లకు కూడా బంగారు పూత పూయించాడు.
- క్రీ.శ.1630లో కంచికి చెందిన కోటి కన్యాదానం తాతాచార్యులు ఆనందనిలయ విమానానికి బంగారు మలాము చేయించాడు.
- క్రీ.శ.1908 సెప్టెంబర్ 30న మహంతు ప్రయాగ దాసుకు సోదర శిష్యుడైన అధికారి రామలక్ష్మణదాసు ఆనందనిలయ విమానంపై బంగారు కలశాన్ని ప్రతిష్ఠించాడు.
- 1958 ఆగస్టు 18 నుండి 27 వరకు పదిరోజులపాటు ఆనందనిలయ విమాన మహాసంప్రోక్షణ జరిగింది. ఆనందనిలయం మరమ్మతులు జరిగాయి. చెలికాని అన్నారావు సారథ్యంలో జరిగిన ఈ పనులకు 12 వేల తులాల బంగారం వాడారు.
- 1964లో అష్టబంధన మహాసంప్రోక్షణం జరిపారు.

'అమెరికా' ప్రమాద మృతులకు కన్నీటి వీడ్కోలు





అమెరికా నుంచి వచ్చిన మృతదేహాలు (ఇన్‌సెట్లో) సాయితేజారెడ్డి, హరితారెడ్డి ఫైల్‌ఫొటో

కేవీబీపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆ రెండు కుటుంబాలు తమ పిల్లల మృతదేహాల కోసం పది రోజులుగా కన్నీరు మున్నీరుగా విలపిస్తూ.. ఎదురుచూశాయి. శుక్రవారం సాయితేజారెడ్డి, హరితారెడ్డి దంపతుల మృతదేహాలు రాగానే వీరి కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోయారు. కేవీబీపురం మండలం ఆదరంలో బంధుమిత్రులు, స్థానికుల కన్నీటి వీడ్కోలు నడుమ ఆ దంపతులకు అంత్యక్రియలు జరిగాయి. ఆదరం గ్రామానికి చెందిన సాయితేజారెడ్డి.. తొట్టంబేడు మండలానికి చెందిన హరితారెడ్డికి 2022లో వివాహమైంది. వీరు అమెరికాలోని టెక్సాస్‌లో స్థిరపడ్డారు. స్నేహితులతో కలిసి విహార యాత్రకు వెళ్లి వస్తుండగా.. ఈ నెల 14న జరిగిన రోడ్డు ప్రమాదంలో హరితారెడ్డి, మరో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా.. సాయితేజారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 15న అసువులు బాసిన విషయం తెలిసిందే. సాయితేజారెడ్డి, హరితారెడ్డి మృతదేహాలను శుక్రవారం స్వగ్రామమైన ఆదరానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో విషాదం నెలకొంది.



రోదిస్తున్న సాయితేజారెడ్డి తల్లి



హరితారెడ్డి తల్లి

ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలగాలి

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం స్టేషన్‌కు వచ్చే ప్రజలతో స్నేహ పూర్వకంగా మెలగాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. తిరుపతి మహిళా వర్సిటీ సావేరి అతిథి గృహంలో శుక్రవారం అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, తిరుపతి, తిరుమల, చంద్రగిరి, రేణిగుంట, శ్రీకాళహస్తి సబ్ డివిజన్ల డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫిర్యాదులపై నాణ్యమైన దర్యాప్తు జరిపి, బాధితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత మనపై ఉంటుందన్నారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. గంజాయి మూలాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. విక్రేతలు, వినియోగదారులు, సూత్రధారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీపావళి, కార్తీక మాసోత్సవాలు రానుండడంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీఐలు, ఎస్‌ఐలు గ్రామాల్లో పర్యటించి సైబర్ నేరాలు, 1930పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, నాగభూషణరావు, రామకృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఎస్పీ సుబ్బరాయుడు

గంజాయి కేసులో బీటెక్ విద్యార్థి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న బీటెక్ విద్యార్థిని శుక్రవారం తిరుపతి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ చిన్నగోవిందు కథనం మేరకు... రూరల్ మండలం పేరూరు శ్మశాన వాటిక వద్ద ముగ్గురు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నట్లు రూరల్ పోలీసులకు సమాచారం అందింది. సీఐ చిన్నగోవిందు సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. పోలీసులను చూసి ఆ ముగ్గురు పారిపోవడానికి ప్రయత్నించారు. పేరూరుకు చెందిన బీటెక్ విద్యార్థి బండారి చిరంజీవిని అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 230 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. మిగిలిన ఇద్దరు పరారయ్యారని సీఐ చెప్పారు.

కాంట్రాక్టర్ల డిష్యుం...డిష్యుం

- తిరుపతి కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలో ఘటన
- 'టెండరు సిండికేట్' వ్యవహారమే కారణమా?

తిరుపతి, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ఓ కాంట్రాక్టర్‌పై మరో కాంట్రాక్టరు దాడికి పాల్పడ్డాడు. టెండర్ సిండికేట్ వ్యవహారంలో మొదలైన గొడవ దాడికి దారితీసినట్టుగా తెలుస్తోంది. తాను ఆన్‌లైన్ టెండర్లో పాల్గొన్నందుకు సహచర కాంట్రాక్టర్ చంద్ర తనపై దాడి చేశారంటూ కమిషనర్ ఎన్.మౌర్యకు కాంట్రాక్టర్ ఎ.వి.చలపతి రెడ్డి ఫిర్యాదు చేశారు. ఎస్పీకి ఫిర్యాదు చేయాలని దీనిపై కమిషనర్ స్పందించినట్టు తెలిసింది. దాడివెనుకగల పూర్వాపరాలను పరిశీలిస్తే.. కార్పొరేషన్ పరిధిలో 44 అభివృద్ధి పనులకు గాను గత నెల 30న ఆన్‌లైన్ టెండర్లను పిలిచారు. ఈనేపథ్యంలో పలువురు కాంట్రాక్టర్లు వివిధ పనులకు ఆన్‌లైన్లో టెండర్లు దాఖలు చేశారు. ఇటీవల ఓ అధికార పార్టీ నాయకుడు కాంట్రాక్టర్లను పిలిచి సమావేశం ఏర్పాటుచేసినట్టు తెలిసింది. పనులన్నీ ఒకరికే కాకుండా అందరూ సమానంగా తీసుకుని 'సిండికేట్ సిద్ధాంతాలను పాటించాలని హితవు పలికినట్టు తెలిసింది. తన లాభాపేక్ష లేకుండా చెప్పిన మాటలకు కాంట్రాక్టర్లు కూడా రింగ్‌గా మారేందుకు దాదాపుగా అందరూ అంగీకరించినట్టు సమాచారం. అప్పటికే దాఖలైన టెండర్లను ఈనెల 17న తెరవాల్సి ఉన్నప్పటికీ వాయిదా వేసుకుంటూ వచ్చారు. కాంట్రాక్టర్లలో కొందరు లీడ్ తీసుకుని 44 పనులకు ఎవరెవరు టెండర్లు వేశారో పేర్లు తెలుసుకుని వాళ్లను బిడ్డింగ్ నుంచి తప్పించే ప్రయత్నం చేసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం టెక్నికల్ బిడ్ ఓపెన్ చేస్తారన్న సమాచారంతో పలువురు కాంట్రాక్టర్లు కార్యాలయానికి చేరుకున్నారు. ఇదివరకే దాఖలైన టెండర్లపై సిండికేట్ అయ్యేందుకు చలపతి రెడ్డి అంగీకరించకపోవడంతో అతడిపై దాడికి దిగినట్టుగా తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో కార్పొరేషన్ కార్యాలయంలో తీవ్ర చర్చకు దారితీసింది. కాంట్రాక్టర్లు రోడ్డున పడడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. సాయంత్రం పలు ఆన్‌లైన్ టెండర్లను తెరుస్తున్నట్టు సమాచారం. అయితే అన్ని పనులకు దాఖలైన టెండర్లను తెరవకుండా కొన్నింటినే ఓపెన్ చేయడంపై పలువురు కాంట్రాక్టర్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పశుగణన ప్రారంభం



తిరుపతి రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాకు సంబంధించి పశుగణన సర్వేని శుక్రవారం తిరుపతి రూరల్ మండలం చిగురువాడ పంచాయతీ పాపిరెడ్డిపల్లెలో కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి పశుసంవర్ధకశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ ప్రారంభించారు. 2025 ఫిబ్రవరి 28వరకు జరిగే ఈ సర్వేలో 16 రకాల జంతువులను గణన చేయనున్నట్లు నాయక్ చెప్పారు. సర్వేకి వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు పూర్తి సమాచారం అందించాలని కోరారు. అందించి సహకరించాలని కోరారు. ప్రతి ఇంటికి సంబంధించి పశువులు, గొర్రెలు, మేకలు, ఫౌల్ట్రీ తదితర వివరాలను ఎన్యుమరేటర్ సేకరించాక, ఆ ఇంటి గోడపై స్టిక్కర్ మార్కింగ్ చేస్తారని కలెక్టర్ తెలిపారు. వీధిలో తిరిగే పశువులు, కుక్కల వివరాలూ సేకరిస్తారని చెప్పారు. అనంతరం ఎన్యుమరేషన్ కరదీపిక, స్టిక్కర్లు, ఐడీకార్డులు, పోస్టర్, కరపత్రాల కిట్‌ని ఆవిష్కరించారు. వెటర్నరీ వర్సిటీ రిజిస్ట్రార్ రవికుమార్, పశుసంవర్ధక జిల్లా అధికారి రవికుమార్, ఏడీ డాక్టర్ శ్రీకాంత్‌కుమార్, వెటర్నరీఅసిస్టెంట్ సర్జన్లు డాక్టర్ యోగానంద్, డాక్టర్ రెడ్డెప్పరెడ్డి, డాక్టర్ శ్రీహరిత, డాక్టర్ శైలజ, రైతులు పాల్గొన్నారు.



మృతి చెందిన వెంకటేశ్వర్లు

రోడ్డు ప్రమాదంలో పండ్ల వ్యాపారి మృతి

వెంకటగిరి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలకేంద్రం సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఎస్‌ఐ సుబ్బారావు కథనం మేరకు.. తోపుడు బండిపై పండ్ల వ్యాపారం చేసుకొనే సాతికాలనీకి చెందిన మావిళ్ల వెంకటేశ్వర్లు క్రాస్ రోడ్డు వైపు వెళ్లేందుకు రిలయన్స్ పెట్రోల్ బంకు వద్ద ఆటో కోసం నిలుచొని ఉండగా ద్విచక్రవాహనం రాంగ్ రూట్ వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడ్డ వెంకటేశ్వర్లును స్థానికులు ఆటోలో ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనదారుడు మురళీని అదుపులోకి తీసుకొన్నారు. కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


రైలు ఢీకొని ప్రయాణికుడి మృతి

తడ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. వరదయ్యపాలెం గ్రామానికి చెందిన ప్రభాకర్(45) శుక్రవారం సాయంత్రం సమయంలో సూళ్లూరుపేటకు వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు లోకల్ ట్రైన్‌లో తడకు వచ్చాడు. రైలు దిగి స్టేషన్ వెలుపలకు వెళ్లే క్రమంలో పట్టాలు దాటుతుండగా చెన్నై నుంచి నెల్లూరు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ ఢీకొంది ఈ ప్రమాదంలో ప్రభాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతిని గంజాయివనంలా మార్చారు

- జగన్‌పై ఓవీ రమణ విమర్శ

తిరుపతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): 'తిరుపతిలో జగన్ రెడ్డి బంధువు, వైసీపీ నాయకుడు గంజాయికి వేసిన మూలాలు ఇప్పటికీ వెంటాడుతున్నాయి. తిరుపతి, రేణిగుంట, శ్రీకాళహస్తిలో గంజాయి వల్ల ఎందరో పిల్లలు బలైపోతున్నారు. తిరుపతిని గంజాయివనంలా జగన్ మార్చారు' అంటూ టీటీడీ మాజీ సభ్యుడు ఓవీ రమణ ధ్వజమెత్తారు. తిరుపతిలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుమల కొండకు కూడా గంజాయి తీసుకెళ్లిన ఘనత వైసీపీదేనని ఆరోపించారు. జగన్ ఇంటి బాగోతాన్ని ఆయనే బయట పెట్టుకున్నారని, తల్లిని, చెల్లిని రోడ్డున పడేశారని విమర్శించారు.



శారదామఠం అక్రమ కట్టడాలపై తక్షణమే చర్యలు చేపట్టాలి: జనసేన

తిరుమల, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని శారదా మఠంలో అక్రమ కట్టడాలపై టీటీడీ ఈవో, అదనపు ఈవో తక్షణమే చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నేత కిరణ్‌రాయల్ కోరారు. తిరుమలలోని శారదామఠం వద్ద శుక్రవారం ఆయన నేతలతో కలిసి శ్రీవారి చిత్రపటాన్ని ఉంచి, కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ అక్రమ కట్టడాలను తొలగించాలని గతంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. స్వామి అనుగ్రహంతో శారదాపీఠం వీటిని కూల్చివేయాలని జీవో వచ్చిందన్నారు. భక్తుల సేవ చేస్తామని తిరుమలలో మఠాలు తీసుకుని స్టార్‌హోటళ్ల తరహాలో భక్తుల నుంచి వసూలు చేస్తున్నారన్నారు. దొంగ రాజకీయనాయకులందరికీ స్వరూపనందేంద్ర బాస్ అని విమర్శించారు. ప్రభుత్వ ఆదేశాలను టీటీడీ అధికారులు పాటించి వెంటనే అక్రమ కట్టడాలను తొలగించాలని కోరారు.



ద్విచక్ర వాహనం బోల్తాపడి యువకుడి దుర్మరణం

కోట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కోట మండలం చిట్టేడు వద్ద శుక్రవారం అర్ధరాత్రి మోటార్ బైక్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో గణేష్ (18) మృతి చెందాడు. మండలంలోని విద్యానగర్ చెందిన గణేష్ స్థానికంగా వాటర్ సర్వీస్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. పని ముగించుకొని బైక్‌లో గూడూరుకు వెళుతుండగా చిట్టేడు వద్ద బైక్ అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. ఎస్‌ఐ పవన్‌కుమార్ ప్రమాద స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.



కామిరెడ్డీ శవ రాజకీయాలు మానుకో: టీడీపీ

కోట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి శవ రాజకీయాలు మానుకోవాలని టీడీపీ నేతలు హితవుపలికారు. కోటలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడారు. మచ్చలేని నాయకుడైన కొండేపాటి గంగాప్రసాద్‌ను కామిరెడ్డి విమర్శించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. సమావేశంలో టీడీపీ అధ్యక్షుడు మండల మద్దాలి సర్వోత్తమరెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపును మరో చోటుకు మార్చండి

చిట్టమూరు, అక్టోబర్ 25(ఆంధజ్యోతి): మండల కేంద్రంలో కూడలి ప్రాంతమైన కొత్తగుంటలో ఏర్పాటు చేసిన మద్యం షాపును మరోచోటుకు మార్చాలని చిట్టమూరు సర్పంచు మీదూరు కోటయ్య, గ్రామస్తులు తహసీల్దారు ప్రసాద్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

పంటకాలువ కబ్జాపై ఫిర్యాదు

పెళ్లకూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నేపల్లి పాపానాయుడు చెరువు నుంచి పంట పొలాలకు సాగు నీరందించే కాలువను ఆక్రమణదారులు కబ్జా చేసినట్లు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యానికి రైతులు ఫిర్యాదు చేశారు.

మోటర్ సైకిల్ ర్యాలీ

వెంకటగిరి టౌన్, అక్టోబరు 25,(ఆంధ్రజ్యోతి): పోలీసు అమర వీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 9వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ అరుణ్ బోస్ ఆధ్వర్యంలో మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

చెంగాళమ్మ సేవలో న్యాయమూర్తి

సూళ్లూరుపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరిని శుక్రవారం నెల్లూరు జిల్లా ఎస్సీ, ఎస్టీ ఐదవ అదనపు న్యాయమూర్తి సరస్వతి దర్శించుకొన్నారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: విజయశ్రీ


ఆస్పత్రిలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్, అక్టోబరు 25: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేదలకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ హెచ్చరించారు. శుక్రవారం నాయుడుపేట పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని ఆమె తనిఖీ చేశారు. ముందుగా రోగులు ఉన్న గదిలోకి వెళ్లగా అక్కడ ఇనుప మంచాలపై పడుకొని ఉన్న రోగులకు దుప్పట్లు వేయకపోవడంతో ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులు పరిశీలించి రోగులు తక్కువ రావడంతో సిబ్బందిని పిలిపించి ఆరా తీశారు. రోగులకు తగిన సౌకర్యాలు లేవని వారు తెలపడంతో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. రోగులకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదని, మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌చార్జి వైద్యాధికారి చంద్రకళ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, సీనియర్ నాయకులు శిరసనంబేటి విజయ భాస్కర్‌రెడ్డి, షేక్ రఫీ, నెలవల రాజేష్, పార్థసారథి, జనసేన నాయకుడు ఉయ్యాల ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కామిరెడ్డికి గంగాప్రసాద్‌ను విమర్శించే స్థాయి లేదు: పాశిం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్‌ను విమర్శించే స్థాయి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డికి లేదని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, సత్యవేడు నియోజకవర్గాల్లో టీడీపీ గెలుపునకు గంగాప్రసాద్ ఎంతో కృషి చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కామిరెడ్డి ఎన్నో అక్రమాలు, అవినీతికి పాల్పడ్డారన్నారు. అనేక కేసుల్లో నిందితుడుగా ఉన్న కామిరెడి నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, అబ్దుల్‌రహీం, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, వాటంబేడు శివకుమార్, వెంకటేశ్వర్లురెడ్డి, పట్టాభి రామిరెడ్డి, నరసింహులు నాయుడు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గంగాప్రసాద్‌ను విమర్శించడం తగదు

పెళ్లకూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, ప్రముఖ వ్యాపారవేత్త కొండేపాటి గంగాప్రసాద్‌ను విమర్శిచడం ఎస్డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డికి తగదని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, ఆ పార్టీ సీనియర్ నాయకుడు పేరం రమేష్‌నాయుడు అన్నారు. శుక్రవారం వారు పెళ్లకూరులో మీడియాతో మాట్లాడారు.

ప్రజలకు రుణపడి ఉంటా: కురుగొండ్ల


డి.వడ్డిపల్లిలో సమస్యలపై సర్పంచుతో చర్చిస్తున్న ఎమ్మెల్యే

డక్కిలి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గ ప్రజలకు తాను జీవితాంతం రుణపడి ఉంటానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మండలంలోని దేవుడువెల్లంపల్లి, డి.వడ్డిపల్లి, లింగసముద్రం గ్రామాల్లో శుక్రవారం పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. దేవునివెల్లంపల్లిలో రూ.10 లక్షలు, లింగసముద్రంలో రూ.5లక్షల వ్యయంతో సిమెంటు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే డి.వడ్డిపల్లి గ్రామంలో రూ.35 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కురుగొండ్ల మాట్లాడుతూ తనకు మూడోసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చిన ప్రజలను మరవలేనని చెప్పారు. ముఖ్యంగా 750 ఓట్లకు పైగా మెజారిటీ ఇచ్చి తన గెలుపునకు సహకరించిన డివడ్డిపల్లి గ్రామాన్ని ఎప్పటికీ మర్చిపోలేనని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు ఎస్ఎస్ఆర్ నాయుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు కోటేశ్వరరెడ్డి, సర్పంచు చెంచమ్మ, టీడీపీ నాయకులు యువరాజ్, వెంకటపతి, చంద్రారెడ్డి, శ్రీరాములు, పెంచలనరసయ్య, నాగభూషణం నాయుడు, తిరుపాల్ నాయుడు, రాంబాబు పాల్గొన్నారు.

దేవాలయ కమిటీల్లో బ్రాహ్మణులకు చోటు హర్షణీయం


రామమోహన్‌రావు

గూడూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల కమిటీల్లో సభ్యులుగా బ్రాహ్మణులకు చోటు కల్పిస్తూ సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయానికి ఆదిశంకర బ్రాహ్మణ సేవా సంఘం తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని సంస్థ గౌరవాధ్యక్షుడు, సీనియర్ ఆడిటర్ శ్రీకంటి రామమోహన్ రావు అన్నారు. శుక్రవారం స్థానిక త్యాగరాజవీధిలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశంలో రాష్ట్రంలోని దేవాలయాల కమిటీల్లో బ్రాహ్మణకు చోటు కల్పిస్తూ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ
ఆరుగురు విద్యార్థులకు స్వల్పగాయాలు

నాయుడుపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో ఆరుగురు విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. మండలంలోని వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు ఆటోలో నాయుడుపేట కళాశాలకు వెళ్తుండగా మూర్తిరెడ్డిపాళెం సమీపంలో లారీ ఢీకొంది. ఈప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బల్లవోలులో గ్రామసభ

చిల్లకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్లవోలులో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. కొంత మంది రైతులు తమ పేర్లు 1-బీ అండగల్‌లో నమోదు కాలేదని, దీంతో ఏపీఐఐసీ కేటాయించిన భూములను నష్టపరిహారం చెల్లించలేదని తహసీల్దారు శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లారు. రీసర్వేలో భూముల విస్తీరణంలో హెచ్చు, తగ్గులు రావడంతో నష్టపోయామని పలువురు రైతులు తెలిపారు. గ్రామసభలో అందిన వినతులను త్వరితగతిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దారు చెప్పారు.